2014 మే

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక


ప్రధాన సంపాదకులు :

**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :

**సామ్రాట్ కొడవటికంటి**

చందా వివరములు :

సంవత్సర చందా రూ. 100/-

పోషక చందా రూ. 500/-

జీవిత చందా రూ. 1000/-

విడి ప్రతి రూ. 10/-

మా చిరునామా :

ఎడిటర్

పరిశుద్ధత

పోస్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281


## లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| సంపాదకీయం | | 02 |
| | ఎడిటర్ | |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | | |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 05 |
| క్రైస్తవులు భయపడతగునా | | |
| | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 08 |
| మావయ్య కథలు 11 | | |
| | రెవ.డా.కె.జోసఫ్‌గారు | |
| యోబు భార్య | స్త్రీల విభాగము | 14 |
| | శ్రీమతి రేచల్ జోసఫ్‌గారు | |
| సృష్టిమర్మం | | 15 |
| | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | |
| పరిశుద్ధాత్ముడు | | 16 |
| | శ్రీమతి కమలా సామ్రాట్‌గారు | |
| యోసేపు మరియు యెరోబాము | | 17 |
| | రెవ.డా.కె. విక్రాంత్‌గారు | |
| నాయకత్వము | | 19 |
| | శ్రీమతి రిబ్కా విక్రాంత్‌గారు | |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | | 23 |
| | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | |


India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |


### ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |



# సంపాదకీయం

ప్రభువు నామమునకు మహిమ కలుగును గాక!

ఆంధ్రప్రదేశ్ పేరు భారతదేశములో మ్రోగిపోతుంది. రెండుగా విడిపోవటము, ఎన్నికలు, ఎన్నికలలో అక్రమముగా తరలిస్తున్న కోట్లకొలది ధనము దేశములో ఏ రాష్ట్రములో కూడా ఇంత ధనము పట్టబడలేదు. మనమే ఫస్టు. మనదెంత కీర్తి. అది కూడా కాకుండా 1947 నుండి ఎంతో గౌరవము సంపాదించుకొని దేశప్రగతికి మూలకారణమైన కాంగ్రెస్ పార్టీ పతనమయి పోవటం చాలా బాధాకరం.

ఎన్నికలలో కొన్ని కొన్ని అవాంఛనీయ సంఘటనలు జరిగినా మొత్తము మీద ప్రశాంతంగానే జరిగినవని చెప్పుకోవలసినదే. అయితే ఇరుపార్టీల వారు అంటే వైయస్సార్‌సిపి మరియు తెలుగుదేశం ఎవరికి వారే తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు. అయితే అధికారులను ఏలికలను నియమించువాడు దేవుడే అనే సంగతి మనమందరము గుర్తుంచుకోవాలి. ఈ సృష్టికంతటికి ఆయనే కర్త. ఆయనే ప్రభువు. అధికారులను ఆయనే నియమిస్తాడు గనుక మనము వేచి చూద్దాము. కాని మనకిష్టమైన నాయకుల కొరకు మనము ప్రార్థించుటలో తప్పులేదు. ఈ పత్రిక మీకు అందేటప్పటికి మన సీమాంధ్రకు ఎవరు ముఖ్యమంత్రో తెలిసిపోతుంది. మనదేశంలో మతసామరస్యం లోపించింది. మత ఛాందస్సులను అరికట్టే వారు వస్తే అందరికి మంచిది. కనుక ముఖ్యమంత్రి అయ్యేవారు మతసామరస్యులుగా ఉండాలని అటువంటి వారినే మనకు ముఖ్యమంత్రిగా మంత్రులుగా ఇవ్వమని దేవుని ప్రార్థించండి.

రాజధానిగా సరైన స్థలము ప్రభుత్వము వారు ఏర్పాటు చేయాలని కూడా ప్రార్థించండి. దేవుడు మిమ్మును దీవించును గాక!

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

4

**- కొడవటికంటి**

"మీ తండ్రిగారు ఏమి చేస్తుంటారు?" అని అడిగాడు యూలి.

"వ్యాపారం - డేరాలు తయారుచేస్తుంటారు. ఎక్కువ భాగం సైనికుల కోసం ఎగుమతి చేస్తుంటారు" అన్నాడు. సౌలు - యూలిని పరీక్షగా చూసాడు. రోమీయునికి ఉండే అహంభావము ఎక్కడా కన్పించలేదు. తనకంటే రెండు అంగుళాలు ఎత్తు ఉంటాడు. అతను ధరించిన పాదరక్షలు ఒక రెండు అంగుళాలు ఎత్తు ఉన్నాయి. బలమైన శరీరం.

యూలి మరలా గుర్తుకు వచ్చినట్లు.... "మిమ్మల్ని రథంలోకి ఎక్కించుకుంటాను అని మీరెందుకు ఊహించారో చెప్పలేదే...? అన్నాడు.

"అది మీ నైజం. అలా చెయ్యకుండా మీరు ఉండలేరు. మీరు రథం దిగేతీరు, మద్యం పాత్రను ఆ పానీయశాల యజమాను చేతిలో నుండి అందుకొనిన పద్ధతి అన్నీ మీ అంతరంగాన్నే వ్యక్తం చేశాయి" అని చెప్పాడు సౌలు.

"ఇవన్నీ మీరు చదివారా?" అడిగాడు యూలి.

''కొంత చదివింది. కొంత పరిశోధించి తెలుసుకొన్నది. గత రెండు సంవత్సరములు తార్సులో మానసిక పరిశోధన చేసాను. ఇప్పుడు సముద్రము కనబడుతోంది. నాలుగు ఓడలు సముద్రములో లంగరు వేసి ఇక్కడకు దూరంగా కనబడుతున్నాయి. ఇపుడు చీకటి ఈ ప్రాంతాన్ని చిన్నగా ఆక్రమించుకుంటుంది. దాన్ని ఎవరు నిరోధించగలరు? ఏదైనా ఒక మూల ప్రాంతంలో - కొంత డబ్బు ఖర్చుతో, కొంత ప్రయాసతో కొంత భాగము కొంచెంసేపు వెలుతురు మయం చేయగలమేమో కానీ, భూమి మీద ఈ విశ్వమంతా వెలుగుమయం చేయగలిగినవాడు యెహోవా దేవుడు ఒక్కడే" అన్నాడు సౌలు.

తీరానికి దూరంలోదించి తన వెళ్ళిపోతాడు కాబోలు అనుకొన్నాడు సౌలు. కాని యూలి ఇవేమి పట్టించుకొన్నట్లు లేదు. అసలు తను రోమా సైనికులలో ఒక విలువైనపాత్ర వహించిన వానిగా కనిపించటం లేదు. తను ఓ సామాన్యునిగాను... తను ధరించిన విలువైన విధి నిర్వాహక వస్త్రములు - విలువ లేనివి అనిపించాయి.

సౌలు ఏమీ మాట్లాకుండా ఆ నాలుగు ఓడలలో తన ఓడ ఏది అని ఆలోచిస్తున్నాడు. ఆ చీకట్లో ఓడలోని దీపాలు తప్ప ఓడ కనిపించ లేదు. యూలి ఏ పనిమీద రేవుకు వచ్చాడో తను అడుగలేదు. రోమా సైనికులు తమ రాకపోకలు తోటి సైనికులతో చర్చించరు. సౌలు యొక్క ప్రయాణం ఎక్కడిదాకా అని కూడా అడుగలేదు. అది వారి సంస్కృతి.

రేవు ప్రవేశ ద్వారం దగ్గర రథం ఆపి సౌలు వైపు తిరిగాడు. సౌలు కృతజ్ఞతాపూర్వకంగా చూసి క్రిందికి దిగాడు. యూలి తన నైపుణ్యం ఉట్టిపడేటట్లు గుఱ్ఱాలను ఏమీ అనకుండానే వాటిని గుండ్రంగా వెనక్కు త్రిప్పి వెళ్ళిపోయాడు. అంతేనేమో! అనుకున్నాడు సౌలు వెళ్ళి పోతున్న రథంవైపు చూస్తూ.... అలానే శూన్యంలోకి చూసే వానివలె నిలబడి పోయాడు.

ఉదయం మళ్ళీ పూర్తిగా తెల్లవారక ముందే ఓడలో హడావిడిగా సౌలు నిద్రలేవ వలసి వచ్చింది. ఓడ ప్రయాణానికి సిద్ధం అన్నట్లు రెండుసార్లు సాగదీసిన కూత కూసింది. సౌలు ఓడ పైభాగము చేరుకున్నాడు. కర్మేలు ఇపుడు సూర్యుని కోసం ఎదురుచూస్తున్న వృక్ష సంపదలో భాగంగా కనిపించింది. ఇదే ఏలియా గారి నివాసం. ఖచ్చితంగా తూర్పు తట్టున ఉన్న ప్రవక్తలను అక్కడికి తీసుకొని రమ్మని అహాబుతో చెప్పింది అందుకే. షునేమీయురాలి కుమారుడు చనిపోయినపుడు ఆమె నేరుగా ఈ పర్వతము దగ్గరకు వచ్చింది. ఎలిషా ప్రవక్త ఇక్కడే నివసిస్తూ ఉండేవాడు, కనుకనే మరలా దేవుడు ఈ పర్వతము వద్దకు తనని తీసుకొని వస్తే కొన్ని దినములు ఇక్కడే ఉండాలి అనుకొన్నాడు.

ఓడ బయలుదేరిన పదినిమిషాలకు గాని, వేగం పుంజుకోలేకపోయింది. ఓడమీద బరువు ఎక్కువగా

లేకపోయినా ఎదురుగాలి వీస్తోంది. యాభై కిలోమీటర్లు ప్రయాణం. అసలు రేవు దగ్గర ఉన్న వంపు చుట్టి రావడానికి మూడు గంటలు పడుతుంది. తూరు దగ్గర ఉన్న సముద్రం కంటే ఈ సముద్రము నీలిరంగులో ఉన్నది. సూర్యకిరణాలు పడినచోట మాత్రమే తెల్లగా కనిపిస్తుంది. మొత్తం మీద కనబడినంత దూరం నల్లగానో, నీలంగానో ఉన్నది.

సముద్ర తీరానికి ఒక మైలు దూరంలో ఓడ ప్రయాణం చేస్తున్నా, ఒడ్డున ఉన్న గ్రామాలు, బారులు దీరి సముద్రపు ఒడ్డుగా నడచిపోయే ఒంటెల గుంపులు స్పష్టంగా కనబడుతున్నాయి. నిన్న సాయకాలం నడచిన దూరం వలన ఈ ఉదయాన సౌలు అలసట చెందలేదు. ఒకవేళ యూలి కనిపించకపోయుంటే? ఏమో... అనుకొన్నాడు.

ఓడలోని ప్రయాణీకులందరిలో తనకు ఏర్పాటు చేసిన గది చాలా అనుకూలమైనది, శుభ్రమైనది. తనంత ధనవంతులెనరూ ఈ ఓడలో ప్రయాణం చెయ్యటం లేదనిపించింది. ఓడ ప్రధాన అధికారి నుండి ఆఖరు పనివాని వరకు ఎంతో గౌరవంగా చూసారు. కాని సిసారియా పట్టణం సమీపించే కొలది వారిలో అలజడి ప్రారంభమైంది. అదే పడవ గమ్య స్థానము. అక్కడనే వీరు సుంకం చెల్లించాలి, వారి ధృవపత్రాలు చూపించాలి. రోమీయులైతే అంత ఇబ్బందిలేదు. తనకు రోమా పౌరుసత్వం ఉంది.

తార్సు పట్టణానికే కాదు, యావత్ ప్రపంచానికి యూదులు వలన వెళ్ళటానికి అలెగ్జాండరు కారకుడ య్యాడు. తన దండయాత్రలతో గ్రీకు భాషను వెంట తీసు కొని వస్తూనే ప్రపంచమంతా ఒక్క జాతిగా ఏర్పాడాలని అన్ని జాతుల వారికి పరదేశములలో అనేకమైన సదు పాయాలు కల్పించాడు. అందువలన ఈనాడు వ్యాపారం చేసే దేశం కాని, ఆ దేశములో యూదులు లేని పట్టణం గాని లేకుండా పోలేదు. యూదులు వెళ్ళిన ప్రతి చోట వారి సమాజమందిరాలు ఉన్నాయి. "తన జాతి ఒక్కటే. ఒకే దేవుని జీవముగల దేవుని ప్రతిబంబము" అని తలుచుకొన్నప్పుడు సౌలుకు సంతోషం కలిగింది.

'సైన్యములకధిపతియైన యెహోవా దేవుని కోసం – మహా రోషము గలవాడను నేను ఒకడను మాత్రమే!' అని తనలో తాను అనుకొన్నాడు.

సిసారియా పట్టణానికి అయిదు కిలోమీటర్లు ఉండ గానే ఎత్తయిన కట్టడాలు కనిపించాయి. గోధుమరంగు కొండలు వరుసగా సముద్రం ప్రక్కనే ఉన్నట్లు కనిపిస్తున్నాయి. సిసారియా సముద్రపు నీళ్ళు కల్మషం లేని హృదయంలాగా, తెల్లగా అడుగు భాగము కనిపించేటట్లుగా ఉన్నాయి.

హేరోదు అంతిపా తండ్రి పరిపాలన ప్రారంభం కాక ముందు ఇది చిన్న ఓడరేవు. ఇక్కడ ఈ సముద్రము మీదనే రెండు గంటయినా రేవు అధికారుల కోసం వేచి ఉండాలి. మనుష్యుల గుర్తింపు, సరుకుల సుంకం అంతా ఇప్పుడే నిర్ణయించబడుతుంది. సౌలు తూర్పున ఉన్న సిసారియా పట్టణాన్ని చూస్తూ ఉన్నాడు.

అయిదు సంవత్సరాల క్రితం యెరూషలేము నుండి తార్సు వెళ్ళేటప్పుడు యొప్పే రేవులో పడవ ఎక్కి, తర్వాత సముద్రంలో ఉన్న ఓడ ఎక్కి ప్రయాణం చేశాడు. సిసారియా పట్టణానికి ఆ ఓడ చేరేటప్పటికి చీకటి పడ్డందువల్ల చీకట్లో ఏమీ కనబడదు. ఈ రోజు సాయంత్రం ఇక్కడికి చేరినందున మధ్యధరా సముద్రములోకి దిగిపోతున్న ఎర్రని సూర్యుని కిరణాలతో నిండిన సిసారియా పట్టణం, ఎరుపురాజుగా పేరుపొందిన ఎదోమీయుల "పట్రా" కంటే సుందరమైనదిగా కనిపించింది. కొంచెం ఎత్తయిన దిబ్బమీద లేక చిన్న కొండమీద కట్టబడిన సుందర స్వప్నమయిన, హేరోదు అధికార మందిరమయిన, గొప్ప భవంతి – చీకటి క్రమ్మకముందే లోపలినుండి రకరకాల రంగులను బయటికి ప్రసరింపచేస్తుంది.

ఈ భవనము ఆ... గొప్ప హేరోదు నివాస మందిరం. అయితే ఆయన చనిపోయిన తర్వాత రోమా ప్రభుత్వం యొక్క కార్యనిర్వహణ కేంద్రం అధికార భవనంగా మార్చబడినది. ఇందులోనే రాజకీయ ఖైదీలు ఉంచబడ తారు. ఓడ రేవు ప్రక్కనే ఉన్న క్రీడా ప్రాంగణం, దానికి ఎగువలో గుర్రపు పందెములు, రథముల పందెములు జరిగే మైదానము. ఈ పట్టణంలో నివసించటం ఒక వరం అన్నట్లుగా ఉంది. **(సశేషం)**

సీరియల్

# మనుష్యులు దేని వలన జీవిస్తారు 3

## (లియో టాల్‌స్టాయ్)

***గత సంచిక తరువాయి....***

ఓరోజు ఉదయం మిఖాయేలు కూర్చుని పని చేస్తుంటే సైమన్ కుమారుడు లోనికివచ్చి "చూడు మిఖాయేలు! అటువైపుగా వారెవరో ఇటువస్తున్నారు" అన్నాడు. మిఖాయేలు పని ఆపి కిటికీలోనుండి చూశాడు. అలానే చాలాసేపు చూస్తూ ఉన్నాడు. మిఖాయేలు అలా ఎన్నడూ బయటకు చూడలేదు. ఓ లావాటి ఆమె ఇద్దరు కవల ఆడపిల్లలను నడిపించుకుంటూ లోనికి వచ్చింది. సైమన్ ఓ కుర్చీ వేశాడు. ఆ ధనవంతురాలైన స్త్రీ అందులో కూర్చుని ఆ ఇద్దరు ఆరుసంవత్సరాల వయసున్న పిల్లల్ని చెరోచేత్తో పట్టుకొని ఉన్నది.

"మీ పిల్లలు కవలపిల్లలా?" అన్నాడు సైమన్ వారికి మంచినీళ్ళు ఇస్తూ.

"లేదండీ! వీరిద్దరూ నా బిడ్డలుకారు. నేను వీరిని చాకుతున్నాను. వీరి తల్లి వీరు పుట్టగానే చనిపోయింది. అప్పట్నుంచి వీరిద్దరు నాకు ప్రాణమయ్యారు. ఇది మరీను.." అని అందులో కుంటుగా నడుస్తున్న అమ్మాయిని గట్టిగా హృదయానికి హత్తుకుంటూ "వీరిద్దరికీ మంచి బూట్లు కుట్టండి" అన్నది.

సైమన్ మిఖాయేలును చూశాడు. అతను తన పనిని ఆపి ఆ ఇద్దరు పిల్లలను తదేకముగా చూస్తున్నాడు. నిజమే పిల్లలిద్దరు చక్కనివారే! కాని ఇతని చూపులు అతను వారిని బాగుగా ఎరిగిన వానివలె ఉన్నాయి. వారిలో ఒకమ్మాయి పాదము మెలిక తిరిగివున్నది.

అది చూస్తూ "ఈ పాదము పుట్టినప్పటి నుండి ఇలా ఉన్నదా?" అని సైమన్ ఆమెను అడిగాడు.

"లేదయ్యా వారిద్దరిని నేను చాకుతున్నాను. నా రొమ్ముపాలు త్రాగినవారే! కాని పుట్టినది నాకు కాదు" అన్నది.

"అదెలా జరిగిందమ్మా?" అన్నాడు సైమన్.

"ఇప్పటికి ఆరు సంవత్సరాల క్రితం వీరి తండ్రి మంగళవారం రోజు చెట్టు అతని మీద కూలడం వలన మరణించి పాతిపెట్టబడ్డారు. వీరి అమ్మ శుక్రవారం రోజు వీరిని ప్రసవించి చనిపోయింది. వేరే గ్రామములో నివశిస్తున్న నాకు ఎనిమిది వారాల బిడ్డ అప్పటికే ఉన్నాడు. మరునాడు నేను వారిని చూడవెళితే ఆ ఊరివారు ఆ తల్లిని కడిగి పాతిపెట్టారు. నేను నా బిడ్డకు పాలిస్తున్నాను కనుక మరియొక పాలిచ్చే స్త్రీ దొరికేవరకు ఆ పిల్లలకు నన్ను పాలియ్యమని అడిగారు.

నేను ఈ పిల్లలను తీసుకొని ఇంటికి వచ్చాను. మొదట్లో ఈ కుంటిపిల్లకు పాలివ్వలేదు. ఎలాగైనా ఇది చనిపోతుంది అనుకున్నాను. కాని దాని ముఖం చూస్తే జాలేసింది. నా బిడ్డతో సహా ముగ్గురికీ పాలివ్వడం ప్రారంభించాను. ప్రభువు ఈ ముగ్గురికీ సరిపోయే పాలకంటే ఎక్కువ పాలను నా రొమ్ములలో ఉంచాడు. రెండు సంవత్సరాల తర్వాత నా కుమారుడు చనిపోయాడు. ఈ బిడ్డలే నా బిడ్డలు అయ్యారు" అని ఆ కుంటిపిల్లని తన హృదయానికి హత్తుకున్నది.

"వీరే నా జీవిత వెలుగు అయ్యారు" అన్నది.

ఇదంతా వింటున్న మాట్రియోనా వచ్చి "నిజమేనమ్మా! తండ్రిలేకుండా తల్లిలేకుండా జీవించగలము కాని, దేవుడు లేకుండా ఎవరూ జీవించలేరు" అన్నది.

ఇలా వారు మాట్లాడుకుంటుంటే ఆకస్మికముగా ఆ గుడిసె అంతా పట్టపగలు వెలుగుతో నిండిపోయింది. అందరు మిఖాయేలు వైపు చూచారు. అతను రెండు చేతులు ముడుచుకొని మోకాళ్ళమీద నిలుచుని ఆకాశము వైపు చూస్తున్నాడు.

ఆ పిల్లలను తీసుకొని ఆ తల్లి వెళ్ళిపోయింది. మిఖాయేలు లేచి నిలుచుని తను కట్టుకున్న పై వస్త్రము తీసివేశాడు. సైమన్‌కు అతని భార్యకు వంగి నమస్కారము చేసి "అయ్యా! దేవుడు నా తప్పులు క్షమించాడు. మీరు కూడా నేను చేసిన తప్పులు ఏమైనా ఉంటే క్షమించండి" అన్నాడు.

సైమన్ అతని దగ్గరగా వెళ్ళి "అయ్యా! మీరు

మామూలు మనిషి కాదు. నిన్ను ఏమి అడుగను కానీ మీరు నా దగ్గర ఉన్న ఆరు సంవత్సరాలలో మూడుసార్లు మాత్రమే నవ్వారు. అప్పుడు నీ ముఖం వెలుగుతుండేది. దీనికి కారణం ఏమిటి?" అన్నాడు.

అప్పుడు మిఖాయేలు వెలుతురు నా ముఖంలో వెలిగింది. నా తప్పు విషయంలో బాధపడ్డప్పుడు, నేను నవ్వినప్పుడెల్లా దేవుడు నన్ను తెలుసుకోమన్న సంగతి తెలుసుకున్నప్పుడు నేను మొత్తం మూడుసార్లు నవ్వింది యదార్థమే! మొదటిసారి నీ భార్య నా యెడల జాలి పడినప్పుడు తర్వాత ఆ ధనవంతుడు బూట్లు కుట్టమన్న ప్పుడు, తర్వాత ఈ చిన్నపిల్లలిద్దరు వచ్చినప్పుడు మూడవ ప్రశ్నకు జవాబు దొరికినప్పుడు నవ్వాను" అన్నాడు.

అప్పుడు సైమన్ "అయ్యా! దేవుడు మిమ్ములను ఎందుకు శిక్షించారు? మీరు నేర్చుకొనిన మూడు సత్యాలు ఏమిటి? దయచేసి చెప్పరా?" అన్నాడు.

"దేవుని ఆజ్ఞను మీరినందుకు ఆయన నన్ను శిక్షించాడు. నేను దేవుని దూతను. ఆయన ఒక స్త్రీ ఆత్మను తీసుకొని రమ్మన్నాడు. నేను భూమిమీదకు ఎగిరివచ్చాను. ఆ స్త్రీ అప్పుడే ఇద్దరు పిల్లలను ప్రసవించినది. ఆ స్త్రీ నన్ను చూడగానే 'ఓ దేవుని దూతా! ఇప్పుడు నన్ను తీసుకొని పోవద్దు. నా చిన్నబిడ్డలు చనిపోతారు. వీరి తండ్రి ఇప్పుడే పాతిపెట్టబడ్డాడు. దయచేసి కొంత సమయము ఇవ్వండి' అని అడిగింది. అప్పుడు నేను ఒక పిల్లను తల్లిరొమ్ముమీద పెట్టి మరియొక బిడ్డను ఆమె చేతులకు అందించి దేవుని దగ్గరకు ఎగిరివెళ్ళాను.

అప్పుడు దేవుడు 'నువ్వు వెళ్ళి ఆ స్త్రీని తీసుకొని రా! తర్వాత నువ్వు మూడు విషయాలు నేర్చుకొని ఇక్కడికి రా!' అన్నాడు. నీవు తెలుసు కొనవలసినవి – ఒకటి మానవులలో ఏమి నివశిస్తున్నది, రెండు మనిషికి ఇవ్వబడనిదేది, మూడు మానవులు దేనివలన జీవిస్తున్నారు? అనునవి.

అప్పుడు నేను మరలా భూమిమీదకు ఎగిరివచ్చాను. తల్లి ఆత్మను తీసుకున్నాను. పిల్లలిద్దరు ఆమె రొమ్ముకు దూరమయ్యారు. తల్లి శరీరం దొర్లి ఓ బిడ్డ కాలుమీద పడింది. నేను ఆ గ్రామము పైకి ఎగరంగానే ఒక గాలి విసిరింది. నా రెక్కలు ఊడిపొయ్యాయి. ఆ తల్లి ఆత్మ దేవుని దగ్గరకు వెళ్ళింది. నేను రోడ్డున పడ్డాను" అని చెప్పాడు. సైమన్‌కి, అతని భార్యకు తాము ఇంతకాలం ఎవరికి దుస్తులిచ్చి ఆహారం పెట్టారో తెలిసినప్పుడు చాలా సంతోషపడ్డారు.

నేను రోడ్డు ప్రక్కనపడి చలికి ఎగిరిపోయి దేవునికి కట్టబడిన ఓ ఆలయం వద్దకు వచ్చాను. కాని అది తాళం వేసివుంది. గాలికి తట్టుకోవాలని ఆ ఆలయం ప్రక్కగా కూర్చున్నాను. ఆకలి, అలసట, చలికి ఒణికిపోతున్నాను. చీకటి పడుతుంది. ఓ మనిషి తనలో తాను మాట్లాడుకుంటూ వెళ్తూ నన్ను చూసి భయపడ్డాడు. నేను కూడా బ్రతికివున్న మనిషిని చూసి భయపడిపోయాను. ఆ మనిషి చలి, ఆకలి గురించి, భార్యా బిడ్డల గురించి పెద్దగానే మాట్లాడుకుంటున్నాడు. ఇతను నాకు ఏం సహాయం చేస్తాడు? అనుకున్నాను. అతను నన్ను చూసి గబగబ వెళ్ళిపోయాడు. కాని కొంచెంసేపటికి తిరిగివచ్చాడు. అతని ముఖంలో మరణం చూశాను. అతను నా ఒంటిమీద గుడ్డకప్పినప్పుడు అతనిలో దేవుని చూశాను. అతని ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఇంతకుముందు ఈ మనిషి రూపం కంటే భయంకర రూపములో కనిపించింది. ఆమె నాకు రొట్టె ఇవ్వడానికి ఒప్పుకోలేదు. ఆమె ముఖంలో మరణము చూశాను. నన్ను బయటకు వెళ్ళగొట్టడానికి వచ్చింది. కాని అతను దేవుని గురించి చెప్పగానే ఆమె మనసు మార్చుకొని నాకు రొట్టె ఇచ్చింది. ఇప్పుడు ఆమె ముఖంలో మరణము నేను చూడలేదు. ఆమె బ్రతికివున్నది. ఆమెలో దేవుని చూశాను.

మనిషిలో ఏమి నివసిస్తుందో అర్థమయింది. ప్రేమ మనిషిలో నివసిస్తున్నది అని తెలుసుకున్నాను. కాబట్టి నవ్వాను. నేను మీతో నివశించాను. కొంతకాలానికి ఓ ధనికుడు బూట్లు కుట్టుకోవడానికి, అది ఒక సంవత్సరం నిలిచేదిగా ఉండాలని వచ్చాడు. కాని అతని వెంట నా స్నేహితుడు మరణదూతగా వచ్చాడు. అతను సాయంకాలం లోపల చనిపోతాడని నాకు తెలుసు. అతనికి ఆ సంగతి తెలియదు. మానవునికి ఏమి తెలుపబడలేదో అది తెలుసుకున్నాను. అప్పుడు రెండవసారి నవ్వాను.

మూడవదిగా ఆ తల్లి తను చనిపోతే బిడ్డల బ్రతుకు ఏమిటి? అని ఏడ్చింది. నేను కూడా నిజమే అనుకున్నాను.

కాని ఆ బిడ్డలు తల్లి చనిపోయినందువలన ఏవిధంగా ఆశీర్వదించబడ్డారో చూచాను. కాబట్టి మనుష్యులు దేనివలన జీవిస్తున్నారో తెలుసుకున్నాను. ఈ మూడు విషయాలు తెలుసుకున్నాను" అన్నాడు.

ఆ దూత వస్త్రములు తీసివేయబడ్డాయి. కండ్లు మిరిమిట్లు గొలిపే వెలుతురు ధరించుకున్నాడు. ఇప్పుడు ఆ దూత వద్దనుండి కాక పైనుండి వస్తున్న స్వరము వినబడుతుంది. "మనుష్యులందరు ప్రేమవలన జీవిస్తున్నా రని తెలుసుకున్నాను" అనిన స్వరము వినిపించింది.

## వెఱ్ఱివాడు - ఇవాన్

ఒకానొక దేశములో ఒక ధనవంతుడైన రైతు ఉండేవాడు. అతనికి ముగ్గురు కుమారులు. పెద్దవాడు సిమియోను – సైనికుడు. రెండవవాడు టెర్రాస్ (లావుగా ఉంటాడు). మూడవవాడు ఇవాన్ (వెఱ్ఱివాడు). మిలానియా అనే కుమార్తె పుట్టుకతో మూగది. సిమియోను సైన్యములో చేరాడు. టెర్రాస్ పట్టణంలో వ్యాపారి అయ్యాడు. ఇవాను అతని చెల్లెలు ఇంటివద్ద పొలంపని చేస్తుండేవారు.

సిమియోను ధనవంతుడయ్యాడు కాని అతని సంపాదన అంతా అతని భార్య తగలేస్తుండేది. ఒకరోజు అతను తన తండ్రివద్దకు వెళ్ళి ఆస్థిలో భాగము అడిగాడు. అప్పుడతని తండ్రి "ఈ ఆస్థి అంతా నీ తమ్ముడు ఇవాన్, మిలానియాల కష్టార్జితము" అన్నాడు.

అందుకు పెద్దవాడు "నిజమే కాని, ఇవాన్ వెఱ్ఱివాడు. అతని చెల్లి మూగది. వారికి ఈ ఆస్థి ఎందుకు?" అన్నాడు.

తండ్రి ఇవాన్‌ను పిలిచి "ఏం చేద్దాము?" అన్నాడు.

"అతని భాగము అతనికివ్వండి" అని ఇవాన్ అన్నాడు. పెద్దన్న తనభాగం తీసుకొని వెళ్ళిపోయాడు.

టెర్రాస్ ధనవంతురాలిని పెండ్లి చేసుకొని ధనవం తుడైనాడు. కాని వారి కోరికలు తీర్చుకోవడానికి ఆ డబ్బు సరిపోలేదు. అతను తండ్రివద్దకు వచ్చి ఆస్థిలో భాగం అడిగాడు. తండ్రి పెద్దవాడికి చెప్పినట్లే చెప్పాడు.

"నిజమే కాని ఇవాన్ వెఱ్ఱివాడు, అతనిని ఎవరు పెండ్లి చేసుకోరు. అతని చెల్లెలు కూడా దేనికి పనికిరానిది. నాకు ధాన్యములో సగం ఇవ్వండి, ఆ నల్లని ఎద్దును ఇవ్వండి. ఇంకేమి వద్దు" అన్నాడు.

"అలానే!" అని ఇవాన్ అతను కోరినవి ఇచ్చి తను, తన తల్లిదండ్రులు, చెల్లెలు ఒక ముసలి ఆవు కలసి ఒక పాత ఇంట్లో నివశించసాగారు. ఇదంతా గమనిస్తున్న పెద్ద సైతానుకు చాలా విచారము కలిగింది. అన్నదమ్ములు ఆస్థి విషయంలో ఎటువంటి తగాదా పడకుండా విడిపోయారే? అని విచారించి, తన ముగ్గురు పిల్లలను (చిన్న సైతానులను) పెద్దగా పిలిచింది.

"ఆ గొప్ప రైతు కుటుంబములోని వారంతా సంతోషంగా విడిపోయి హాయిగా ఉన్నారు. నాకిదేమి నచ్చలేదు. మీరు ముగ్గురు బయలుదేరి ఆ అన్నదమ్ములు ఒకరినొకరు కొట్లాడుకొని బాధపడే విధంగా చెయ్యాలి" అన్నది. అప్పుడు ఈ మూడు చిన్న సైతానులు ఒక చోట కూడుకొని చాలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు. ఒక సమయము ఏర్పాటు చేసుకొని ముగ్గురు బయలుదేరి వారి పని సాధించి మళ్ళీ ఇక్కడికే రావాలి. అప్పుడు ఎవరికయినా ఎక్కువ సహాయం కావాలంటే మిగిలినవారు అతనికి సహాయం చెయ్యాలి.

కొన్నిరోజుల తర్వాత మూడు చిన్న సైతానులు కలుసుకున్నాయి. మొదటిది ఇలా చెప్పింది "నేను పెద్దవాడు సిమియోను దగ్గరకి వెళ్ళి అతనిలో గొప్పవాడిని కావాలని, పేరు ప్రఖ్యాతలు సంపాదించాలనే ఆశ పుట్టించాను. అతను రాజు దగ్గరకు వెళ్ళి సైన్యము నా కప్పగించండి. నేను పిర్కి రాజ్యము మీద దండెత్తి కొల్లగొట్టి తెస్తాను అన్నాడు. రాజు అతనిని సైన్యాధ్యక్షునిగా చేసి పంపించాడు. నేను అతని విరోధి రాజు దగ్గరకు వెళ్ళి గడ్డిమోపులను గొప్ప సైన్యంగా మార్చాను. యుద్ధంలో సిమియోను ఓడిపోయాడు. రాజు గారికి కోపంవచ్చి అతని ఆస్తినంతా తీసుకొని అతనిని దేశబహిష్కరణ గావించాడు. ఇప్పుడు అతను తన తండ్రి వద్దకు వస్తాడు" అని చెప్పాడు.

రెండవ సైతాను ఇలా చెప్పింది "నా పని చాల సులువు. టెర్రాస్ ధనవంతుడే! మంచి వ్యాపారవేత్త. కాని నేను అతని మెదడులో దూరి అతనికి ఆశ పెద్దది చేశాను. వెంటనే అతను తన దగ్గరున్న డబ్బు, బంగారం అంతా పెట్టుబడి పెట్టి వ్యాపారం పెద్దది చేసాడు. ఇప్పుడు అతను ఏమి లేనివాడై తన తండ్రి దగ్గరకు వస్తాడు" అన్నాడు.

**(ఇంకావుంది)**

# క్రైస్తవులు భయపడతగునా?

దేవుడు నీకు ఏదైనా ఆజ్ఞ ఇచ్చినప్పుడు అంటే భయపడవద్దు అని అన్నాడనుకోండి - నీవు అలా చెయ్యటానికి కావలసిన శక్తి ఆ మాటలోనే ఉన్నది. నీ వింకను భయపడుతుంటే - నీవు భయపడకుండా ఉండటానికి నీ శక్తికి అడ్డుగా ఉన్నదేదో సరిచూసుకో. అన్నిటికంటే ముందు నీవు సరిచూసుకోవలసినది నీ రక్షణ - నీవు రక్షించబడ్డావా? ఎందుకంటే దేవుని యొక్క వాగ్దానాలన్ని ఆయన బిడ్డలకే పరిమితము. దేవుడు ఎవరిని మోమాటపడి చెయ్యడు. దేవుడు అబద్ధమాడడు అని గ్రహించుటకు నీకు ఆయన గ్రంథములో సరియైన అనుభవము ఉన్నదా?

**తీతు 1:2**

2. నిత్య జీవమునకై రక్షణ, ఈ ప్రపంచము పుట్టకముందే వాగ్దానము చేశారు. ఆయన ఎన్నడు అబద్ధమాడడు. దేవుడు అబద్ధమాడడు. దేవుని కుమారుడైన యేసును అంగీకరించిన వారందరికి వాగ్దానము చేశాడు. మనము మారుమనస్సు పొంది నిత్యజీవమునకు వారసులమైతే మనం మరణిస్తాము అనే భయము రాదు. చనిపోయే విషయం నీవు భయపడుతున్నావంటే ముందు చెప్పిన వాగ్దానాల విషయం నీవు ధ్యానించలేదన్నమాట. దేవుని వాక్యము నీ అంతరంఘములో స్థిరపడేంతవరకు ఆ వాక్యాన్ని ధ్యానించలేదన్నమాట.

దేవుడు మన ఆత్మలతో సంబంధము పెట్టుకుంటాడు కాని చదువు సంధ్యలతో అనుభవముతో సంబంధము ఉండదు. నీ ఆధ్యాత్మిక జ్ఞాపక బ్యాంకులో దైవ వాక్యము లేని యెడల పరిశుద్ధాత్మ దేవుడు మనం ప్రయాణించ వలసిన మార్గములో ఎలా నడిపించగలడు? బైబిలులో మనం ఏది చదివి నేర్చుకొని దాచుకున్నామో వాటి ద్వారానే మనతో సంబంధము కలిగి ఉంటాడు.

(మన శరీరములకు మెదడు ఎలాగున్నదో మన ఆత్మకు ఆత్మీయ మెదడు ఉంటుంది. శరీర మెదడుకు ఆత్మీయ మెదడు అంటు కట్టబడి ఉంటుంది. ఇక్కడ పరిశుద్ధాత్మ మనతో కలుసుకొని మనల్ని నడిపిస్తాడు.)

దేవుడు ఎన్నడు అబద్ధమాడడు అని స్థిరముగా నమ్మిన తర్వాత రోమాపత్రిక 2:11 దేవునికి పక్షపాతము లేదని చదివిన తర్వాత దేవుడు అంటే ఏమిటో సరియైన భావము కలిగి ఉంటావు. దేవుడు అబద్ధమాడడు అని తన పిల్లలం దరిని ఒకే రకముగా ప్రేమిస్తున్నాడు అను ఈ రెండు విష యాలు నీ విశ్వాస జీవితములో ఈ రెండు ఆలోచనలు ఎల్ల ప్పుడు నీవు ఆలోచిస్తూ ఉంటే నీవెన్నడును భయపడవు. ఈ విషయాల్లో దేనినైనను నీవు అనుమానించన యెడల దేవుడు ఎన్నడును అబద్ధమాడడని, పక్షపాతముతో కొందరిని ఎక్కువ ప్రేమించి కొందరిని తక్కువ ప్రేమించడని, వాక్యములో ఉన్న అన్ని ఆశీర్వదాలు యధార్థమని నమ్ముతావు.

ఈ ప్రపంచమునకు ఏం జరుగబోతున్నదో అనే అనుమానమును నా జీవితములో ఆనందపారవశ్యము పొందలేని అనే భయాలను పారద్రోలాలంటే ముందు నీవు దైవ వాక్యమును రాత్రింబవళ్ళు ధ్యానిస్తూ దానిలో జీవించాలి. మూడవదిగా దేవుడు తన బిడ్డలనందరిని సమానమైన ప్రేమతో ప్రేమిస్తున్నాడు అనే మాటను పెద్దగా మననము చేసుకుంటూ అవి మన ఆత్మలో ఒక భాగమై యుండేటట్లుగా ధ్యానించాలి.

దేవుడు పక్షపాతి కాడనే దానికి ఈ క్రింద బైబిలులో ఉదాహరణలు చూడండి. దానియేలు 10:12, 2దినవృ త్తాంతము 10:7, కీర్తనలు 82:2, మత్తయి 22:14, లూకా 20:23, అపో.కా. 10:34, గలతీ 2:6, ఎఫెసీ 6:9, కొలస్సి 3:11, 3:25, యాకోబు 2:9, పేతురు 1:17.

బాగా అనుభవజ్ఞుడనైన మనస్తత్వ శాస్త్ర వేత్తగా నేను చెప్పేదేమంటే దేనినైనా మాటిమాటికి క్రమం తప్పకుండా ధ్యానిస్తే దానిని విశ్వసించకుండా ఉండలేము.

ఇది ఎలా ఉంటుందంటే బంకమట్టి బాట మీద మాటిమాటికి బండి నడిపించినట్లుంటుంది. బండి చక్రము అంత గట్టిపడి ఎండి అలవరచబడినదన్నమాట. దేవునికి మహిమ కలుగునుగాక! అదేమనకు కావలసింది. దేవుని

యొక్క వాగ్ధానాలు నెరవేర్చబడుటకు శక్తి ఎక్కడున్నదో అక్కడ మనం అతుక్కుని ఉండాలి.

**మొదటి భాగము పొడిగింపు :**

పోయినసారి మనం ధ్యానము చేస్తూ మార్కు 4:35-41వద్ద ఆగాము. యేసుప్రభువు దోనె వెనుకభాగమున నిద్రించు చుండెను అని జ్ఞాపకము చేసుకోండి శిష్యుల సంగతి పట్టించుకోవద్దు. ఎందుకంటే వారు చాలా అలజడి చెందియున్నారు. మనం వారివలె ఉండకూడదు.

ప్రస్తుత అలజడి కలిగిన పరిస్థితులలో నేను మునిగిపోను చచ్చిపోను, నా శత్రువునుండి నన్ను కాపాడే యేసు నన్ను విడిపిస్తాడు. ఆయన నన్ను యేమి చెయ్యాలనుకున్నాడో అది పూర్తిచేస్తానని వాగ్ధానము చేశాడు. మన తండ్రి మనలను ఏమి చేయమని కోరుచున్నాడో పౌలుగారు వివిధ సంఘాలకు వ్రాసిన ఉత్తరాలలో వాటిని వ్రాసి ఉన్నాడు. కోపపడవద్దు, కుళ్ళుబోతుగా ఉండవద్దు అని మొదలైనవి వ్రాసి ఉన్నాడు. అవి చదవమని నా సలహా (కొలస్సి 3:8) మన అవసరాలకంటే ఇతరుల అవసరాలు తీర్చటం, భూసంబంధమైన వాటిమీద మనసు నిలుపకుండా పైనున్న వాటిమీదనే మనస్సు పెట్టవలెను (కొలస్సి 3:2) ఎందుకంటే మన నివాసము దేవుని ఇంటిలోనే ఉన్నది. మరొక మాటలు చెప్పాలంటే బైబిలు గ్రంథము యేసు యొక్క మనస్సును దేవుని చిత్తమునై యున్నది.

కాబట్టి మనం దేవునికి ఇష్టము కలిగించే వేమిటో తెలుసుకొనుటకు బైబిల్ గ్రంథమును ఎన్నో ఎన్నోసార్లు చదివి వాటి ప్రకారం నడుచుకొనవలయును. మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనక - వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి. (యాకోబు 1:22)

శిష్యులు యేసుప్రభువును నిద్రలేపి వారిని కాపాడమని అడిగారు. వెంటనే ఆయన లేచి అక్కడి పరిస్థితిని తన అదుపులోనికి తీసుకున్నాడు. ఈ పని మనమే చేయవలసి ఉన్నది. ఏదైన సమస్య ఉత్పన్నమైనపుడు అవి ఇబ్బందికరముగా మారినపుడు ఆ పరిస్థితి మనం అదుపులోనికి తీసుకొని అందుకు కారకులైన దురాత్మలను గద్దించి వెళ్ళగొట్టాలి. ప్రతి సమస్యకు ఏదో ఒక దురాత్మ మూలము అయి ఉంటుంది.

దురాత్మలను గద్దించటం ప్రార్ధన కాదు. యేసుప్రభువు గాలిని గద్దించిన తర్వాత సముద్రముతో నిమ్మళించమని చెప్పాడు. ఇది ప్రార్ధన కాదు. ఇది ప్రార్ధించుటకు సమయము కాదు. తుఫానుకు ముందు విశ్వాస గృహమును కట్టుకొనుటకు ప్రార్థించవచ్చును. దేవుడు నిన్ను విడిపించ గలడు కాని తుఫానులో నీవు ఇల్లు కట్టలేవని గుర్తుంచుకో. విశ్రాంతిగాను నిమ్మళంగాను ఉన్నప్పుడే నీవు ఇల్లు కట్టగలవు.

మన జీవితము అన్నిటికి యేసుప్రభువే మార్గదర్శి. తుఫానులో ఆయన ప్రార్థించలేదని గమనించండి. ప్రార్ధన కూటాలకు మధ్యలో ఆయన ప్రార్థించేవాడు అని మనకు ధర్మశాస్త్రము చెప్పియున్నది. కాని ఇది ప్రార్ధన చేసే సమయము కాదు. శిష్యులు ఆయనను నిద్రలేపిన వెంటనే లేచి ప్రార్థించేవాడు. చాలామంది క్రైస్తవులు వారి దుఃఖసమయములో విపరీతముగా ప్రార్థిస్తుంటారు ఏమంటే అపాయము రాకముందే వారు వాక్యమును ఎక్కువగా ధ్యానించాలి. విశ్వాస శక్తిని పొందాలి. ఇది ప్రార్ధన సమయము కాదు. మనము ఏమి చెయ్యాలో అది యేసు చేశాడు. ఆ సమస్యతో మాట్లాడి సాతానును గద్దించటం ఆయన ఏది అవసరమో ఆ విధంగా ఆజ్ఞాపించాడు. ప్రార్థించటానికి సమయము ఉంది. మాట్లాడటానికి సమయము ఉంది.

మాట్లాడవలసిన సమయములో నువ్వు ప్రార్థించ వద్దు. నువ్వు ప్రార్థించవలసిన సమయములో మాట్లాడ వద్దు. యేసు తన తండ్రికి ప్రార్థించలేదు. ఆయన గాలితో మాట్లాడుతున్నాడు. ఈ గాలి ఓ పర్వతము తోను లేక మనల్ని చుట్టుకొనే అడ్డంకులతో పోల్చవచ్చును. ధర్మశాస్త్రములోని విడుదలకైన వాగ్ధానాలు ఇస్తున్నాను. మార్కు 11:22-24, మత్తయి 21:21, లూకా 17:6, జకర్యా 4:7, వీటిని ధ్యానిస్తూ చదవండి.

**ముఖ్యమైన మర్మములను ప్రశ్నలు బయలుపరుస్తాయి.**

40వ వచనములో యేసు వారిని ఒక ప్రశ్న అడిగాడు. చాలా తరచుగా ఈ ప్రశ్నను మనం చదువుతాము కాని మన మెదడులో దానిని పదిలపరచము. ఈ ప్రశ్నకు జవాబు చెబుతారని ప్రభువు ఆ ప్రశ్న అడుగలేదు.

దేవునికి సమస్తము తెలుసును గనుక శిష్యులు ఎదుర్కొం టున్న సమస్య ఏమిటో వారు అర్థం చేసుకోవాలని యేసు వారిని ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలోనే ఆ సమస్యకు జవాబు ఉన్నది. ఆ ప్రశ్న మన సమస్యకు మూలం ఏమిటో మన హృదయములో భద్రం చేసుకొని తరువాతి కాలం అటు వంటి సమస్యలు వచ్చినపుడు మనం ఏవిధంగా ప్రవర్తిం చాలో తెలుపుతుంది.

ఆయన ప్రశ్న ఏమిటి అంటే వారు అసలు **విశ్వాసము లేకుండా ఎందుకు అంత భయముతో ఉన్నారు**? అన్నది. ప్రభువుతో జీవిస్తు ఆయన క్రియలను నేర్చుకొనే శిష్యులకు ఈ ప్రశ్న గొప్ప ఇబ్బంది కరమైనదే. రాత్రింబగళ్ళు యేసు యొక్క అద్భుతకార్యములు చూచుచూ విశ్వాసములో మునిగిన శిష్యుల వంటివారు మరెవరు ఉండరు. అటు వంటి వారు భయపడటమే ఆశ్చర్యం.

**2. యేసుతో నీవు రాంత్రింబవళ్ళు జీవించావా?**

రాత్రింబవళ్ళు దేవుని వాక్యమును ధ్యానించటము యెహోషువ 1:8 ద్వారా చెప్పబడింది. అప్పుడు జయ జీవితం జీవిస్తాము.

యెహోషువ 1:8. ఈ ధర్మశాస్త్ర గ్రంథము నీవు బోధింప తప్పిపోకూడదు. దానిలో వ్రాయబడినవాటన్నిటిని ధ్యానించిన యెడల నీ మార్గమును వర్ధిల్ల చేసుకొని చక్కగా ప్రవర్తించెదవు. మార్కు 4:41 వచనము ప్రకారం చూస్తే – ఈ శిష్యులు యేసుప్రభువును నడిపిస్తున్న సభలు ఆయన మాటిమాటికి చేస్తున్న కార్యాల మీద మనసు పెట్టినట్లుగా లేరు. మీరెందుకు విశ్వాసము లేకుండినారు అని ప్రభువు అడిగిన ప్రశ్నను వారు తప్పుగా అర్థం చేసుకున్నారు. ప్రశ్నకు సరియైన జవాబు ఇవ్వకుండా అందుకు బదులుగా వారు బహుగా భయపడ్డారు. ఇంతకుముందు భయపడిన దానికంటే ఎక్కువగా భయపడ్డారు. చెప్పలేనంత ఎక్కువ భయపడ్డారు. ఈ విషయం ప్రభువుకు సంతోషము కలిగించునా? ఖచ్చితంగా ఆయనకు కలిగించదు. ఎందు కంటే భయము అనేది విశ్వాసికి వ్యతిరేకము. విశ్వాసము లేకుండ ఎవడును దేవునికి ఇష్టుడుగా ఉండనేరడని హెబ్రి పత్రిక 11:6లో వ్రాయబడినది మనందరికి తెలుసును. సరియైన ప్రతిస్పందన ఏమంటే భయపడినందున పశ్చాత్తాపపడటమే. మేము తప్పుచేశామని వారు చెప్ప వలసినది. యేసు వారిని ప్రేమిస్తున్నాడు కనుక తుఫాను (అపాయము) ఉన్నచోటికి వారిని పంపించడు కదా!

వారు పశ్చాత్తాపపడి మరియొకసారి యేసు ప్రేమ విషయములో అనుమానము కలిగి యుండమని చెప్పవలసినది.

సరియైన విధముగా స్పందించకపోగా వారి భయాన్ని మరి యెక్కువ ఎత్తుకు ఎత్తారు. యేసు ప్రభువుకలిగిన బలమైన అభిషేకము మధ్యలో వారున్నారు. అభిషేకము మధ్యలో ఉండికూడ ఆ అభిషేకములో కొంత అయినా వారు అనుభవించలేదు. ఈవిషయాన్నే వారు గమనించాలని యేసు కోరుతున్నారు. ఆయన మాటలలో ఎంతో శక్తి విడుదలయింది. అభిషేకముతో గాలితో మాట్లడాడు. ఆయన పలుకులు వారు విన్నారు. ఆయనలో నుండి బయలువెళ్ళిన శక్తిని చూచారు. అయనా ఇవేమి భయాన్ని వారికి దూరం చెయ్యలేదు. వారు అమితముగా భయాక్రాంతులయ్యారని బైబిల్ చెబుతున్నది. అమితముగా అంటే ఇంతకుముందెన్నడు భయపడని విధంగా అని అర్థం.

దేవుని వాక్యంలోని ప్రతిమాట శక్తితో నింపబడి ఉంది అని మనకు తెలుసు. ఆ శక్తిని మనం గ్రహించకపోతే ఉపయోగించు కోవాలనే ఉద్దేశం లేకుంటే మనల్ని కాపాడుటకును స్వస్థపరచుటకు ఆశీర్వదించబడి అభివృద్ధి చెందే ఆశీర్వాదమును పోగొట్టుకుంటాం.

బైబిల్ చెబుతుంది. భయపడవద్దని. నిజానికి భయపడవద్దని ఆజ్ఞాపిస్తుంది. అయితే మనం అలా ఉన్నామా? చాలా విషయాలలో క్రైస్తవులు ఎక్కువ భయపడుతుంటారు. ఆ భయాన్ని బాగా పెంచుకుంటారు. రేపటి గురించి భయపడుతుంటారు. రేపేమి జరుగుతుందో అని అసలు రేపు అనేది వారు చూస్తారో చూడరో అనే సంగతి కూడా తెలియకుండానే రేపటి గురించి భయపడుతుంటారు. ఆయన కొండమీద ప్రసంగములో అనేకసార్లు రేపటిని గూర్చి చింతపడకుడి అని ప్రసంగము చేశాడు. ఈ వాక్యభాగాన్ని క్రైస్తవులు అనేకసార్లు చదువుతుంటారు. అయినా వారు వాక్యమునకు వ్యతిరేకముగా చేస్తుంటారు. ఒక తప్పు పనిని దేవుడు గౌరవిస్తాడా? ఖచ్చితంగా గౌరవించడు. అందువలననే మన ప్రార్ధనలకు జవాబు రావటంలేదు.

## చిన్నపిల్లల పేజి




ప్రభువునందు ప్రియ బాలబాలికలకు హృదయ పూర్వక దీవెనలు, మామయ్య కథలు మిమ్మును ఎంతగానో ఆకర్షిస్తున్నందుకు నాకు చాలా సంతోషముగా ఉన్నది. పోయిన నెలలో మామయ్య కథలు లేనందుకు మీరందరు నా మీద యుద్ధమునకు దిగినంతగా ఫోన్‌ల ద్వారా దండెత్తారు. ఈ ఎండలలో మీటింగులు ఉండుట వలన వ్రాయలేకపోయాను. ప్రతి కథలోను ఒక చక్కని నీతి ఉంటుంది. ఆ నీతిని మీరు నేర్చుకుంటే ఇంకా సంతోష స్తాను. మన యేసయ్య కూడా ఆనందిస్తారు. మీకు దీవెనలు ఇస్తారు. అయితే మీకు ప్రతి నెల "టాల్‌స్టాయి" కథలు ప్రచురిస్తున్నాము. అవి ప్రపంచ ఖ్యాతి చెందినవి. అవి ఎంతో బాగా ఉంటాయి. చక్కని నీతి కూడా ఉంటుంది.

**ఇప్పుడు మీ కొరకు ఒక చక్కని మామయ్య కథ.**

చాలా కాలం క్రితం అంటే 1895-96 ప్రాంతంలో భారతదేశంలో యేసు బోధలు ఎక్కువగా ఉండేవికావు. అసలు క్రైస్తవులను తక్కువ కులం వారని పెద్ద కులస్తుల ఇండ్లలోనికి కాని వీధులలోనికి కాని, దేవాలయాలలోని కాని రానిచ్చేవారు కాదు. స్కూల్సు మాత్రం క్రైస్తవ మిషనీర్లు ఏర్పాటు చేసి అందరికి ప్రవేశం కల్పించారు. అంటే అంతకుముందు అసలు విద్యా బోధన ఎక్కడో పెద్ద సిటీలలో తప్పితే చిన్న చిన్న టౌన్స్‌లో కూడా ఉండేదికాదు. క్రైస్తవ మిషనరీలు వచ్చి చిన్న చిన్న పల్లెటూర్లలో సైతం ప్రైమరీ స్కూల్సు పెట్టి అందరికి విద్య ఏర్పాటు చేసారు. అప్పుడు అక్కడ కూడా మోతుబరి రైతులు బాగా డబ్బు ఉన్న పెద్ద కులాలవారు తమ పిల్లల ప్రక్కన తక్కువ కులస్తులైనవారు కూర్చుంటే ఊరుకొనేవారు కాదు. టీచర్స్‌ను కూడా దబాయించేవారు. అసలు 1950లో నేను 6వ క్లాసు చదివేటప్పుడు కూడా బస్సులలో (అప్పుడు గవర్నమెంటు బస్సులు లేవు) తక్కువ కులంవారు డబ్బులు కట్టి టికెట్ కొన్నప్పటికి పెద్ద కులస్తులకు దూరంగా కూర్చోవాలి. వారిని తాకకూడదు. ఒకవేళ పెద్ద కులస్తులకు స్థలం లేకపోతే తక్కువ కులంవారు వారికి దండం పెట్టి లేచి వారు కూర్చున్న స్థలం కండువాతో తుడుచి వారికివ్వాలి. అప్పుడే అంత భయంకరంగా ఉంటే ఇంక దానికి 5సం॥ ముందు ఏ విధంగా ఉండేదో ఆలోచించండి ఆశ్చర్యంగా ఉంది కదూ! అప్పటి పరిస్థితి ఆ విధంగానే ఉండేది. ఇప్పుడు అటువంటి దురాచారాలు చాలా మరుగైపోయాయి. అందుకే మీకు ఆశ్చర్యంగా ఉంటుంది.

ఇక అసలు కథలోకి వద్దాము. అలాంటి రోజులలో ఒక చిన్న పట్టణములో జరిగిన సంగతేమంటే ఆరవ క్లాసులో దాదాపుగా ముప్పై మంది పిల్లలు ఉన్నారు. అందులో ఆడపిల్లలు ఐదుగురు మాత్రమే ఎందుకంటే అప్పుడు అసలు ఆడపిల్లలకు చదువు అవసరం లేదు అనే అభిప్రాయంలో మన దేశ ప్రజల ఉండేవారు. ఇప్పుడయితే ఆడపిల్లలే "ఫస్టు". ఈ కులభేదాలు మత భేదాలు పెద్దవాళ్ళకే గాని చిన్న పిల్లలకి అప్పుడు లేవు. ఇప్పుడు లేవు అసలు ఎప్పుడూ వుండవు కూడ. ఎందుకంటే వారు దైవ స్వరూపులు యేసుప్రభువు సైతము పెద్దవాళ్ళను చూసి వారి మధ్యలోనున్న ఒక చిన్నబిడ్డను నిలువబెట్టి మీరు

మార్పునొంది చిన్నబిడ్డలవంటి వారైతేనే గాని పరలోకంలో ప్రవేశింపరని సెలవిచ్చారు. కనుక పెద్దవాళ్ళు చిన్న పిల్లలను వేరు వేరుగా కూర్చో బెట్టినా చిన్నపిల్లలు అందరూ కలిసే కూర్చునే వాళ్ళు చాలా స్నేహంగా ఉండేవారు. అయితే కొంతమంది డబ్బున్న పిల్లలు కూడా ఉండేవారు. అందులో బాగా డబ్బున్న వారు పెద్దకులస్తుల పిల్లలు పోకిరిగా ఉండేవాళ్ళు. కావాలని తగువులు పెట్టుకునే వారు. వాళ్ళకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్న వాళ్ళని ఏదో ఒక విధంగా ఇబ్బంది పెట్టేవారు. వాళ్ళ నోట్సులు చించేసేవారు. పుస్తకాలు దొంగతనం చేసి ఎక్కడో పడేసి ఏడ్పించేవారు. బూతులు తిట్టేవారు. ఇప్పుడు కూడా అటువంటి వారు ఉన్నారు కదా? ఆ... ఉంటారు ప్రతిచోట ఉంటారు. వాళ్ళు సైతాను బిడ్డలన్న మాట. దేవుని బిడ్డలైతే అట్లా ఇతరులను కష్టపెట్టరు, కుళ్ళుబోతు పనులు చేయరు. అందరితో చక్కగా సహవాసంగా, సంతోషంగా ఉంటారు.

ఆ క్లాసులో ఉన్న ఐదుగురు ఆడపిల్లలో ఇద్దరు తక్కువ కులం వాళ్ళు వారు క్రైస్తవ కుటుంబస్తులు. వాళ్ళ ఇండ్లలో ఎప్పుడు ప్రార్ధనలు ఉంటూ ఉండేవి. అప్పట్లో ప్రతి క్రైస్తవ కుటుంబంలో కుటుంబ ప్రార్ధనలు ఉండేవి. మరి ఇప్పుడు మీ కుటుంబములో ఉంటున్నవో లేవో మీకే తెలియాలి. మా చిన్నతనంలో మా క్రైస్తవ పేటలో ప్రతి కుటుంబములో సాయంత్రమైతే అందరు కుటుంబ ప్రార్ధనలో ఉండాలి. ఎంత చక్కగా ఉండేదో అందరు కలసి రెండు పాటలు పాడి బైబిలు చదువుకొని అమ్మకాని నాన్నకాని దానిని కొద్దిగా వివరించి బిడ్డలు ఏ విధంగా ఉండాలి ఏ విధంగా తలిదండ్రులకు లోబడి ఉండాలో ప్రతిదినం చెబుతూ ఉండేవారు. మాకు ఎంతో సంతోషంగా ఉండేది.

అప్పుడు ఆ విధంగా చిన్న పిల్లలను తల్లిదండ్రులు నిజ క్రైస్తవులుగా తీర్చిదిద్దేవారు. ఈ ఇద్దరు క్రైస్తవ బాలికలు ఒకరు అచ్చమ్మ ఇంకొకరు లచ్చమ్మ. అప్పట్లో పేర్లు ఆ విధంగానే పెట్టుకునేవారు. వీళ్ళు ఎవరి జోలికి పోకుండా చక్కగా చదువుకుంటూ క్లాసులో ఫస్టు మార్కులు తెచ్చుకునే వారు. అందరికి లోబడి అందరి ప్రేమను పొందారు. ఇది పోకిరి పిల్లలుకు నచ్చలేదు వారి మీద అసూయ పెంచు కున్నారు. వారిని రకరకాలుగా తిప్పలు పెడుతు ఉండేవారు బూతు మాటలు కూడా తిట్టేవారు. అందులో గోపి అనేవాడు మరీ దురుసుగా ఉండేవాడు ఆటలాడు కునేటప్పుడు ఎప్పుడు తొండి చేసేవాడు. వాడితో కూడా ఉన్న అల్లరి పిల్లలు కూడా వాడితో చేరి గోల చేసేవారు. మా యింటిలో పాచి పని చేసే దాని కూతుళ్ళురా వీళ్ళకి ఫస్టు మార్కులేంటి. మాకంటే తక్కువ మార్కులు తెచ్చు కోవాలి మీరు ఈసారి ఫస్టు మార్కులు తెచ్చుకుంటే మిమ్మల్ని ఏం చేస్తామో చూడండి అని భయపెట్టేవారు. గొడవలవుతాయని వాళ్ళు ఇంటి దగ్గర చెప్పేవాళ్ళు కాదు. వాళ్ళలో వాళ్ళే కుమిలి ఏడ్చేవారు. క్రైస్తవ మగపిల్లలు కూడా వీళ్ళకు సహాయం చేయ లేకపోయే వాళ్ళు. ఎందుకంటే వాళ్ళ తండ్రులు తల్లులు పెద్దకులస్తుల ఇండ్లలోనే పని చేయాలి. వాళ్ళు పెట్టిన గింజలు మిగిలిన భోజనాలు తినాలి. అందుకని ఏ సహాయము చేయలేకపోయారు. ఆ గోపి అనే కుర్రవాడు మరీ పేట్రేగి పోయి అచ్చమ్మ, లచ్చమ్మల జడలు లాగటము ముందుకు పడద్రోయటంలాంటి పనులు కూడా చేయసాగాడు. మాష్టారు చూసి చూడనట్లు ఉండేవారు. ఎప్పుడయినా ఒకసారి గద్దించేవారు కాని ఇంకేమి చేసేవారు కాదు. అయితే మిగతా ముగ్గురు ఆడపిల్లలు మాత్రం గోపిని మిగతా అల్లరి మూకను అలాచేయవద్దని కోప్పడేవారు కాని వారు లక్ష్య పెట్టేవారు కాదు.

ఒకసారి పెద్దకులస్తుల పిల్లలలోనే జగడము మొదల యింది. రోజు ఏదో ఒక నెపంతో తగువులాడటం తన్ను కోవటం మొదలయింది. అది వారి తలితండ్రులకు తెలిసి గోపి మీద ఆ ఊరి పెద్దకు రిపోర్టు చేసారు. అప్పటిలో గ్రామ సమస్యలన్ని ఆ ఊరి పెద్దకాపే రచ్చ బండ దగ్గర పరిష్కరించి తప్పు చేసిన వారికి శిక్షలు వేసేవాడు. గోపి మీద ఇంతకు ముందే చాలా కేసులు వున్నవి. కనుక గోపి తల్లిదండ్రులను పిలిచి అందరిముందు విచారించి తప్పు గోపిదేనని తేల్చి కొంత డబ్బు జరిమానా విధించారు. ఈసారి కనుక అటువంటి పోకిరి పనులు చేసి గ్రామములో తగువులు తెస్తే గోపిని వారి తల్లిదండ్రులకు వారం రోజులు గ్రామ బహిష్కరణ జరుగుతుందని తీర్పు జరిగింది. దానికి అందరు సమ్మతించారు.

ఈ సంగతి లచ్చమ్మకు, అచ్చమ్మకు తెలిసింది అచ్చమ్మకు భలే సంతోషమయింది. కాని లచ్చమ్మకు

మాత్రము అతని మీద జాలివేసింది. మనము శత్రువులని ప్రేమించి వారి కొరకు ప్రార్థించాలని యేసు చెప్పారు కదా అని అచ్చమ్మను వారించి. మనము గోపి కొరకు ప్రార్థించాలని చెప్పి రోజు ఇంటి దగ్గర ప్రార్థించేవారు. గోపిలో మాత్రం ఏ మార్పు రాలేదు.

ఒక రోజు ఉదయం బడికి వచ్చేటప్పుడు లచ్చమ్మ పుస్తకం క్రింద పడింది. వెనక వస్తున్న గోపి దానిని తీసికొని ఇదిగో నీ పుస్తకమని దానిని మధ్యకు చించి ఇచ్చి అందరిలో నవ్వసాగాడు. అప్పుడు లచ్చమ్మ గోపితో ఈ విధంగా పోకిరి చేష్టలు చేయటం వలన నీకేమి లాభం అందిరిలో చెడ్డవాడవని పేరు తెచుకున్నావు. మీ తల్లిదండ్రులకు అవమానం తెస్తున్నావు. నేను నీ కొఱకు దేవుని ప్రార్థిస్తున్నాను అని చెప్పింది. అయితే గోపి పెద్దగా నవ్వి ఎవరికి మీ కులం తక్కువ దేవుడికా అని పెద్దగా నవ్వాడు. లచ్చమ్మ ఏడ్చుకుంటు క్లాసుకి వెళ్ళింది. ఆ రోజు సాయంత్రమే మరలా పిల్లలలో తగువు మొదలైంది కొట్టుకోవటం మొదలయింది. గోపి ఒక రాయి తీసికొని తనను కొట్టి వెళుతున్న పిల్లవాడిని విసురుగా కొట్టాడు అయితే అది గురి తప్పి అటుగా వస్తున్న లచ్చమ్మ తలకి బలంగా తగిలింది. లచ్చమ్మకి విపరీతంగా రక్తం కారటం మొదలయింది స్పృహ తప్పి పడిపోయింది. అందరు కలసి తలకు కట్టుగట్టి అక్కడకి రెండు మైళ్ళ దూరంలోనున్న టౌన్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళారు. లచ్చమ్మ తల్లి దండ్రులు ఎంతో ఏడ్వటం మొదలుపెట్టారు. హాస్పిటలు వారు ఇది చాలా ప్రమాదకరమయిన దెబ్బ అని పోలీసులకు రిపోర్టు చేసారు. లచ్చమ్మ స్పృహ రాలేదు అయితే స్కూలు పిల్లలు అది గోపి చేసిన పని అని చెప్పారు. వెంటనే గోపిని అరెస్టు చేసి తీసుకొని వెళ్ళారు. గోపి తల్లిదండ్రులు ఎంత బతిమిలాడినా ఒదలలేదు. పైగా ఆ పిల్లకు ఏమైనా అయితే అసలు ఇంటికి కూడా రాడు ఇటు నుంచి ఇటే బాలనేరస్తుల జైలుకు పంపుతామని చెప్పారు. ఆ ఊరి పెద్దకూడా ఏమి సహాయం చేయలేదు. ఆ ఊరి వారు కూడా తగిన శాస్తి జరగాలని అనుకున్నారు. గోపితో అల్లరి పిల్లలుగా ఉన్న వాని స్నేహితులు కూడా గోపికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారు.

రెండు రోజులు తరువాత లచ్చమ్మకు తెలివి వచ్చింది. తల్లిదండ్రుల వలన జరిగిన సంగతి అంతా తెలుసుకుంది. మనస్సులోనే అయ్యో పాపం అనుకుంది. శత్రువులను క్షమించాలని యేసు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకుంది. పోలీసులు వచ్చారు జరిగిన సంగతిని గురించి అడగారు. అప్పుడు లచ్చమ్మ గోపి తనని కొట్టలేదని గోపి విసరిన రాయి తనకు తగుల లేదని తానే పరిగెత్తుతూ అక్కడ ఉన్న ఒక కూసు రాయి మీద పడటం వలన దెబ్బ తగిలిందని చెప్పింది.

అందరు ఆశ్చర్యపోయారు. అందరు ఎంత చెప్పిన తన మాటను మార్చలేదు. చేసేది లేక పోలీసులు గోపిని వదలిపెట్టారు. గోపి లచ్చమ్మను ఎంతో బాధించేవాడని పిల్లలందరు చెప్పటం వలన ఇక ఆ పిల్ల ఖచ్చితంగా జరిగింది చెపుతుంది తన కుమారునికి విడుదల లేదని విచారిస్తున్న తల్లిదండ్రులకు చాలా ఆశ్చర్యం కలిగింది. పోలీసుస్టేషను నుంచి గోపిని తీసుకొని నేరుగా లచ్చమ్మ హాస్పిటల్‌కి వెళ్ళారు. అక్కడ అందరు గోపిని తన్నాలని చూస్తున్నారు లచ్చమ్మ వున్న బెడ్ దగ్గరకు రాగానే గోపి బోరున ఏడ్చేశాడు. వెక్కిళ్ళుపెట్టి లచ్చమ్మని క్షమించమని అడగసాగాడు. అయితే లచ్చమ్మ గోపి ఏడవకు నీవు మారావు. మా యేసయ్య చెప్పినదే నేను చేసాను. అపకారికి ఉపకారం చేయమని యేసు చెప్పాడు. నీ మీద నాకు కోపం లేదు. నువ్వు స్వతహాగా మంచివాడివి. కాబట్టి దిగులుపడకు మనం ఎప్పుడు స్నేహితులమే అని ఎంతో ప్రేమతో పలికింది. అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్య పోయారు. అందరి కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి. లచ్చమ్మ పూజించే దేవుని బోధలలో ఇంత మహత్యమున్నదా అని అందరూ దేవుని మహిమపరచారు. అప్పటి నుంచి గోపి పూర్తిగా మారిపోయాడు. ఆ స్కూలు పిల్లలందరు ఎంతో సహవాసముతో ఒకరినొకరు క్షమించుకుంటూ ఆదర్శంగా జీవించసాగారు. గోపి లచ్చమ్మలు ఎంతో స్నేహితులుగా మారిపోయారు. పిల్లలో వచ్చిన మార్పును చూచి పెద్దవారు కూడా యేసుని, యేసు బోధలని ఇష్టపడటం మొదలు పెట్టారు.

చూశారా బాలలు ఒక చిన్నబాలిక శత్రువును ప్రేమించటం ద్వారా ఆ ఊరినే మార్చివేసింది. కనుక మీరు కూడా మీ యెడల అపరాధములు చేసిన వారిని క్షమించి దేవుని సంతోషపరచి దైవాశీర్వాదములు పొందండి.

దేవుడు మిమ్మును ఆశీర్వదించుగాక.

# యోబు భార్య

బైబిల్‌లో కొందరి పేర్లు వ్రాయబడి లేదు. లోతు భార్య, యోబు భార్య, షునేమియురాలు సారెపతు విధవరాలు, సమరయ స్త్రీ ఇలా కొందరి పేర్లు వారి భర్త పేరుతోనో లేక వారు నివసించే స్థలము పేరుతోనో వ్రాయబడినవి. యోబు పేరు తెలియని వారు లేరు. యోబు ఊజు దేశములో మంచి పేరు తెచ్చుకొన్నాడు. బహు సంపద కలిగినవాడు. దేవుని యందు భయభక్తులు కలిగి చెడుతనమును అసహ్యించుకొనిన వాడు. అందుని బట్టి దేవుడు అతనిని దీవించాడు. అన్ని విషయములలోను ఆశీర్వదింపబడిన యోబు తన భక్తి జీవితములో కూడ అభివృద్ధి పొందుచుండెను.

ఈనాడనేకులు ఆర్థికంగా ఆశీర్వదింపబడిన తరువాత ఆధ్యాత్మికంగా పతనమైపోతున్నారు. అయితే యోబు ఆస్తి మీద కాక అన్ని ఇచ్చి ప్రభువు మీదే తన గురిని నిలిపాడు. యోబు భార్య యోబువలె భక్తి పరురాలు కాక పోయినప్పటికి యోబును బట్టి ఆమెయు అన్ని విషయములలో ఆశీర్వాదమును అనుభవించుచుండెను. యోసేపు పోతీఫరు అను అన్యుని ఇంటిలో పనిచేయుచున్నప్పుడు యోసేపునుబట్టి ఆ పోతిఫరు కూడ ఆశీర్వదించబడెను. పరిశుద్ధ జీవితం జీవించేవారు వారి మట్టుకు వారేకాక ఇతరులకుకూడ ఆశీర్వదముగా ఉంటారు. అనేకసార్లు భార్య ఆశీర్వాదాలకు అర్హురాలు కాకపోయినా భర్తను బట్టి ఆశీర్వదింపబడుతుంది. అలాగే భర్త యోగ్యుడా కాకపోయినా భార్య యొక్క ప్రార్ధననుబట్టి ఆశీర్వదింపబడతాడు. అయితే అనేకులు దీనిని గ్రహింపరు. యోబు భార్య ఈ కోవకు చెందినది. యోబుకున్న భక్తి విశ్వాసము, ప్రార్ధన యోబు భార్యకులేవు. యోబు అరుణోదయమున లేచి దేవునికి బలులు అర్పించేవాడని బైబిల్‌లో వ్రాయబడి ఉన్నది. యోబు భార్యలో అటువంటి ప్రార్ధనలేదు. యోబు బండ మీద కట్టబడిన ఇంటివలె ఉండెను. కనుకు తుఫానువలె శోధనలు శ్రమలు వచ్చినపుడు యోబు విశ్వాసం స్థిరముగా ఉండెను. ఒక్క దినములోనే గొఱ్ఱెలు, మేకలు, ఒంటెలు, గాడిదలు ఉన్న సమస్త ఆస్తి చివరికి కన్న పదిమంది బిడ్డలు కూడా పోయినప్పటికి యోబు యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొనిపోయెను అని చెప్పి నిబ్బరముగా ఉండకల్గెను. అయితే యోబు భార్య అట్లు అంగీకరించినట్లు కనబడలేదు.




శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్

యోబు చివరికి తన ఆరోగ్యమును కూడ పోగొట్టుకొని మానసికంగాను శారీరంగాను కృంగియుండగా యోబు భార్య భర్తను గౌరవించలేదు. ఆదరించలేదు. యోబుకు కష్టాలు ప్రారంభమైన తరువాత ఆమె యోబుతో ఉన్నట్లు కనిపించ లేదు. యోబు స్నేహితులు మాటి మాటికి వచ్చి పరామర్శించి వెళ్ళేవారు. కాని యోబు భార్యలో ఈ పలుకరింపు లేదు. యోబు అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు బహు వేదన కరమైన కురుపులతో బూడిదలో కూర్చొని బిల్ల పెంకుతో గోక్కొనుచుండగా అన్ని పోయిన నేనున్నాను గదండి అని ఆదరించవలసిన యోబు భార్య ఇంకా ఎందుకయ్యా నీ భక్తి దేవుని దూషించి మరణము కమ్మనెను. ఇది ఎంత భయంకరము. యోబు భార్య మాటను సాతాను మాటలని గుర్తించగల్గిన యోబు మూర్ఖురాలు మాటలాడునట్లు నీవు మాటలాడుచున్నావు. మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా కీడును మనము అనుభవించ తగదా అని గద్దించెను.

బలవంతుడైన సమ్సోను సాతానునిచే ప్రేరేపించబడిన దెలీలా మాటలకు ప్రాణము విసిగి చావగోరినట్లుగా యోబు చావగోరలేదు గాని నేను చావను బ్రతికి దేవుని కార్యాలను వివరింతును అన్నట్లుగా ఉండెను. దేవుని కృపను బట్టి యోబు భార్య తన భర్త గద్దింపును తీసికొనెను. కనుక మరలా పదిమంది బిడ్డలను సంపాదించు కొనెను. పోగొట్టుకొనిన సకల సంపదలు రెండంతల ఆశీర్వాదిముగా పొందెను. ఈ వర్తమానము చదువుచున్న బిడ్డలారా మీ కుటుంబంలో వస్తున్న శోధనలను ఎదుర్కొన గలుగుచున్నావా? సర్వకృపానిధియును దేవుడు కొంచెము కాలము మీరు శ్రమపడిన పిమ్మట తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును అని నమ్మి శోధనలో శ్రమలలో దేవుని విడువక ఉండినచో దేవుడు మిమ్మును దీవించును.

# సృష్టి మర్మం




సృష్టి యొక్క మర్మము పరిశుద్ధ గ్రంథములో ఆదికాండము 1లో చూచినట్లైతే ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను అని వ్రాయబడి యున్నది. భూమి అనగా భూమి. ఆకాశము అనగా పైనున్న ఆకాశము. నక్షత్రములు శూన్యము కాదు ఆకాశము అనగా పరలోకము. స్వర్గము. ఇంగ్లీషు బైబిల్లో God created Heaven and Earth అని వ్రాయబడి యున్నది.

దేవుడు పరలోకమును సృజించెను. భూమిని సృజించెను. భూమి సృజించినపుడు ఎలా ఉన్నది. ఆకాశములకు సృష్టికర్తయే దేవుడు. ఆయన భూమిని కలుగజేసి దానిని సిద్ధపరచి స్థిరపరచెను. నిరాకారముగా నుండునట్లు దానిని సృజించలేదుగాని నివాస స్థలము అగునట్లు సృజించెను యెషయా 45:8 – వాక్యమును గమనించినట్లైతే ఆదికాండము 1:1కి సరిపోతుంది గాని ఆది 1:2 వాక్యానికి సరిపోవటం లేదు. అది వ్యతిరేకతను చూపుతున్నది కారణం ఏమిటి? జాగ్రత్తగా తెలుసుకొందాము ఆదికాండము 1:1లో ఆదియందు దేవుడు భూమ్యాకాశములు సృష్టించెను అని వ్రాయబడియున్నది. ఈ వాక్యము యొక్క పూర్తి అర్థము ఏమిటి? ఒక్క మాటలో ఎంతో నిగూడమైన భావాన్ని యిమిడ్చాడు భగవంతుడు. ఆకాశమును సృజించెను అనగా కీర్తన 33:6లో యెహోవా వాక్కు ద్వారా ఆకాశమును సృజించెను. ఆయన నోటి ఊపిరి ద్వారా వాటి సర్వ సమూహము కలిగెను. ఆయన మాట యియ్యగా దాని ప్రకారము ఆయెను. ఆయన మాట సెలవియ్యగా కార్యము స్థిరపరచబడెను. అనగా ఆకాశములు సృజించెను. సృజించిన ఆకాశములో వాటి సర్వసమూహము అనగా సూర్యుడు చంద్రుడు నక్షత్రములు ఇతర గ్రహములు ఇతర ఆకాశమండలములన్నియు ఒక్క మాటలో సృజింపబడెను. అనగా సౌర కుటుంబము ఆయన మాట సెలవియ్యగా కార్యము స్థిరపరచబడెను. అనగా అవి ఏఏ పనులు చెయ్యవలయునో ఏఏ విధంగా యుండాలో ఏ విధమైన స్థిరత్వములో పని చెయ్యాలో వాటి యొక్క నిలకడ కట్టడలు వాటిని స్థిరపరచబడెను ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణములైయున్నవి (హెబ్రి 1:3).

ప్రపంచము అనగా సూర్యుడు, చంద్రుడు నక్షత్రములు అనగా సౌర కుటుంబము. ఇలాంటి కొన్ని సౌర కుటుంబములు అని పేరు పెట్టినది సైన్సు. ఇలాంటి అనేక సౌర కుటుంబములు అని పేరు పెట్టినది సైన్సు. ఇలాంటి అనేక సౌరకుటుంబములు కలిపి పాలపుంతయని. ఇలాంటి పాలపుంతలు అనేకమైన వాటిని కలిపి లోకము అని మన సైన్సు తెలియపరచుచున్నది. ప్రభువైన క్రీస్తు నేను లోకమునకు వెలుగైయున్నాను. నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండును అని వారితో చెప్పెను (యెషయా 8:12). ఆ వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించుచున్నారు (యోహాను 3:19).

రెండవదిగా భూమిని సృష్టించెను అను ఆ మాటలోని భావం ఏమటి? అనగా భూమి అంటే మట్టి మాత్రము అనుకొనేరు. కాదు కాదు ఆయన భూమిని దానిలోని సర్వమును సృష్టించెను (కీర్తన 146:6). అనగా ఎఱ్ఱమట్టి ఇసుక మట్టి, చేలు మట్టి, రాయి. ఈ రాయిలో అనేక రకములైన రాళ్ళును, బొగ్గు, మాంగనీస్ ఇతర ఖనిజములు గ్యాసు, నీళ్ళు. ఈ నీళ్ళలో ఉప్పునీరు చప్పనీళ్ళు తీపినీరు ఆయిల్ గ్యాస్ వేడి మరియు అనేక రత్నములు సృజించెను.

మానవుడు తన విశేష జ్ఞానముతో భూమిని గూర్చి పరిశీలన చేసినపుడు మొట్టమొదట భూమి బల్లపరుపుగా యున్నదని కనుగొనెను. ఆ తరువాత కొన్ని సంవత్సరములకు మరో సైంటిస్టు ప్రయోగాలు పరిశీలన చేసి భూమి

గుండ్రముగా యుండెనని ఆ తరువాత మరో సైంటిస్టు భూమి గుండ్రముగా యుండుటయే కాదు తన చుట్టు తాను తిరుగుచు సూర్యుని చుట్టు తిరుగుట వలన రాత్రింబగళ్ళు ఏర్పరచబడుచున్నవని సర్వమానవాళికి తెలియజేసెను సదరు విషయములు సర్వశక్తి మంతుడైన దేవుడు ప్రపంచములకు నిర్మానికుడైన ప్రభువు పరిశుద్ధ గ్రంథములో క్రీస్తుకు పూర్వమే తన ప్రవక్తలను ఎన్నుకొని ఇలా వ్రాయించెను యోబు 26:7. శూన్యముపైకి ఉత్తర దిక్కునున్న ఆకాశ విశాలములను ఆయన పరచెను. శూన్యము పైన భూమిని వ్రేలాడదీసెను. ఆయన భూమిని వ్రేలాడ తీయునప్పుడు భూమి ఎలా యున్నది? చతురస్రాకారముగా యున్నదా? దీర్ఘ చతుర స్రాకారముగా యున్నదా? గుండ్రముగా యున్నదా? వంకర టింకరగా యున్నదా? అనే ప్రశ్నలు మనలో వచ్చినప్పుడు దేవుడిచ్చిన సమాధానము. ఆయన వలన నడిపింపబడినదై నివాస యోగ్యమైన భూగోలం మీద మెరుపులు ఉరుములు సంచారము చేయును యోబు 37:12. సదరు వాక్యము వలన భూమి ఎలాయున్నది? గోళముగా అనగా గుండ్రముగా బంతివలె యున్నదని దేవుడు తెలియపరచుచున్నాడు. అంతే కాకుండా ఈ గోళాకారముగాయున్న భూమి తన చుట్టు తాను తిరుగుచు సూర్యుని చుట్టు తిరుగుట వలన రాత్రింబవళ్ళు ఏర్పరచబడుచున్నవి అని తెలియపరచుచున్నారు. అయితే ఇంత మొత్తం భూమిని ఎవరు త్రిప్పుచున్నారు? అనే మరో ప్రశ్న వారికి ఎదురైనది. కొంతమంది సైంటిస్టులయితే ప్రకృతి సహజ సిద్ధం అని అయస్కాంత సిద్ధాంతం అనుకొని దానిని వదిలి వేసారు వారికిక అర్థం కాలేదు.

ఎందుకంటే వీరు దేవునికి తమ హృదయములో చోటు ఇవ్వలేదు. దేవుడొకడున్నాడు ఈ సర్వసృష్టి నిర్మాణకుడు ఒకడున్నాడని వారి హృదయంలో చోటు ఎంత మాత్రం ఇవ్వనందున సదరు ప్రశ్నలకు సమాధానము దొరకక పోయినది కాబట్టి సదరు విషయానికి జవాబు దేవుడే తెలియపరచుచున్నాడు. "భూమిని దాని స్థలములో నుండి కదలించువాడు ఆయనే! దాని స్థంభములు అదరజేయువాడు ఆయనే" (యోబు 9:6) సదరు విషయములన్నియు తన ప్రవక్తల ద్వారా పరిశుద్ధ గ్రంథములో తెలియపరచి వ్రాయించినాడు.

మనుష్యుడు దేవుని దృష్టికి ఎట్లు నిర్దోషి అగును? వాడు ఆయనతో వాజ్యమాడగోరిన యెడల వేయి ప్రశ్నలలో ఒక్క దానికైనను వాడు ఆయనకు ఉత్తర మియ్యలేదు. ఆయన మహావివేకి. అదికబల సంపన్నుడు (యోబు 9:3).

"నేను లోకమునకు వెలుగును. నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగి యుండునని వారితో చెప్పెను" (యోహాను 8:12).

వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమక్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి (యోహాను 3:19)

దేవుడు పరలోకమును సృజించినపుడు ఆయన ఒక్కడు మాత్రమే నివసించుచున్నాడు ఆయన గుణగణాలు ఎట్లు యున్నవి?తనకు తానైయున్నవాని గుణలక్షణాలు ఏమిటి? ఆయన మొదటి లక్షణం దేవుడు ప్రేమైయున్నాడు. ప్రేమ అంటే ఏమిటి? ఎదుటివారికి మేలు చేయాలి అనే తపన. ఎదుటివారి సంతోషము కోసం అవసరమైతే ఎంతటి నష్టాన్నైనా ఓర్చి ఎదుటి వాళ్ళు సంతోషంగాయుంటే చూచి మురిసి పోవటం. అయితే దేవుని ప్రేమకు స్పష్టత నిర్దిష్టత యున్నది. ఆ ప్రేమ జ్ఞానవంతమైన ప్రేమ, తెలివితో కూడుకొన్న ప్రేమ తన బాధ్యతలు ఎరిగిన ప్రేమ అందుకే "యెహోవా అందరికి ఉపకారి (కీర్తన 145:9).

ప్రేమ అనేది ఎక్కడ ఉన్నా అది ఏదొక విధంగా వ్యక్తికరింపబడాలని కోరుకుంటుంది. ప్రేమించే స్వభావం కలిగినవాడు తాను ప్రేమించటానికి ఎవ్వరు లేకపోతే బాధపడిపోతాడు. ప్రేమించే వ్యక్తికి తాను ప్రేమించటానికి ఎవరో ఒకరు కావాలి. ఈ కారణాన్నిబట్టి ఉన్నవాడు అనబడే దేవుడు మనుష్యులను సృష్టించుకొన్నాడు.

సృష్టికి కారణం ప్రేమ. సృష్టికి మూలం ప్రేమ. అందుకే

**...మిగతా 19వ పేజిలో**

# పరిశుద్ధాత్ముడు



శ్రీమతి కమలా సామ్రాట్

పరిశుద్ధాత్ముడు ప్రత్యక్షపరిచే ఆత్మయైయున్నాడు మనము దేవుని వాక్యాన్ని చదివి ఆయన కొరకు కనిపెట్టినపుడు పరిశుద్ధాత్ముడు మనతో మాట్లాడుతాడు పరిశుద్ధాత్ముడు సర్వజ్ఞుడైన దేవుడు. పరిశుద్ధాత్ముడు జ్ఞాన వివేకములు గలవాడు జ్ఞానవాక్యమనే ఆత్మీయ వరము పరిశుద్ధాత్ముని వరములలో ఒకటి (1 కొరింథీ 12:8) నీవు దేవుని మాటలకు విధేయుడవైతే నిన్ను మంచి వరములతో నింపేందుకు ఆయన యిష్టపడుచున్నాడు.

పరిశుద్ధాత్ముని వరములలో స్వస్థత అనేది ఒకటి లూకా 4:18. ప్రభువు ఆత్మ నామీద ఉన్నది. బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను చెరలోనున్న వారికి విడుదలను.... నలిగిన వారిని విడిపించుటకు (స్వస్థపరుచుటకు) నలిగిన వారు అనగా అనారోగ్యముతో బాధలు వేదనలతోనున్న ప్రజలు. 12 సంII నుండి రక్త స్రావం కలిగిన స్త్రీ పరిశుద్ధాత్ముని శక్తి ద్వారా స్వస్థపరచబడింది.

అపొస్తలలు కూడా పరిశుద్ధాత్మచే నింపబడి అనేక చోట్ల అనేక మంది రోగులను స్వస్థపరిచారు ఎన్నో అద్భుతాలు చేశారు దేవుడు మనలను పరిశుద్ధాత్మతో ముద్రించడమేకాక మన హృదయంలో ఆయన ఆత్మను సంచకరువుగా యిచ్చాడు (2 కొరింథీ 1:22).

నీవు నేను పరిశుద్ధాత్మునితో నింపబడినప్పుడు ఒక స్పష్టమైన రుజువును మనం చూస్తాము పరిశుద్ధాత్ముడు మనలో రూపాంతరాన్నె తీసుకొస్తాడు. మనమే మాత్రము ఇంతకు ముందునట్లు ఉండము మనలో అనేకమైన ఆత్మీయ పనులు ప్రారంభమవుతాయి (తీతుకు 3:4-6).

యోహాను 3:8లో గాలి తన కిష్టమైన చోటను విసరును నీవు దాని శబ్దము విందువేగాని అది యెక్కడ నుండి వచ్చునో ఎక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మ మూలముగా జన్మించిన ప్రతివాడును అలాగే యున్నాడని యేసు ప్రభువు నికొదేముతో చెప్పాడు. ఆత్మ మూలముగా జన్మించిన ఒక వ్యక్తి ఆత్మ ఫలమును ఫలిస్తాడని గలతీ 5:22-23 లో చదువుతాం. అటువంటి వ్యక్తి ఆత్మ వరాలను పొందేందుకు ఎంతో ఆసక్తి కలిగి ఉంటాడు (1 కొరింథి 12). పరిశుద్ధాత్ముని శక్తి అగ్నితో పోల్చబడింది కాని ఆయన అగ్ని కాదు! అగ్ని కాల్చి వేస్తుంది నాశనం చేస్తుంది వేడినిస్తుంది.

ఇశ్రాయేలీయులు అరణ్యయాత్రలో దేవుడు రాత్రి సమయాల్లో అగ్ని స్తంభం ద్వారా వారిన నడిపించాడు అదే విధంగా నూతన ఇశ్రాయేలీయులమైన మనం కూడా పరిశుద్ధాగ్నితో నడిపించబడుతున్నాం.

"పరిశుద్ధాగ్ని" అపొస్తలుల జీవితాలలో ఎంతో మార్పును తీసుకొచ్చింది ఆ అగ్ని మోషే జీవితంలో ఏలీయా జీవితంలో ఎంతో మార్పు కలుగ జేసింది ఆ అగ్ని నీవు కూడా కలిగియున్నావా పరిశుద్ధాత్మలోను అగ్నితోను బాప్తిస్మమిచ్చు వాడు యేసుప్రభువే (మత్తయి 3:11) గనుక నూతన అభిషేకం కొరకు హృదయ పూర్తిగా ఆయన్ను అడుగుదాం.

# యోసేపు మరియు యరోబాము



డా. విక్రాంత్ కొడవటికంటి

బహుశ్రమలను సహించి తుదకు జయించిన మంచి యోసేపు చెరసాలలో నుండి బయటకు వచ్చి ఐగుప్తు దేశానికి ప్రధాన మంత్రియై కరువు నుండి లోకమును రక్షించెను. యోసేపు స్వంత సహోదరులే ఆయన మీద విరోధముగా లేచి పగబట్టి తిరస్కరించి గోతిలో పడద్రోసి డబ్బుకొరకు అన్యులకు అతనిని అమ్మివేసిరి. అంతేకాదు తండ్రి మిగుల ప్రేమతో ఇచ్చిన పవిత్రమైన అంగీని చింపి మేక పిల్ల రక్తములో ముంచి తండ్రియైనా ముసలి యాకోబుకిచ్చె. ఇది మాకు దోరికెనని అబద్ధాలు చెప్పి ఆ తండ్రికి మిగుల అంగలార్పు పుట్టించిరి. యోసేపు దానికి ముందు తన రెండు కలలలో వీరందరు వచ్చి తనకు సాష్టాంగ పడుదురని చూచెను. అటులెయాయెను? అంతేకాదు ఐగుప్తులో దాసుడుగా అమ్మబడి పోతీఫరన బడిన యొక అధికారి యింట నమ్మకముగా పని చేస్తునపుడు ఆ యజమాని భార్యచే శోధించబడి అన్యాయముగానే చెరసాలలో త్రోయబడెను ఆది 39:20. చెప్పుచున్నట్లు తుదకు యోసేపు ఖైదీలలోను, అతిక్రమ దారులలోను ఒకడుగా యెంచబడి ఆ చెరసాలలో నిలిచిపోయెను. తన తండ్రికి యోసేపు మిక్కిలి ప్రియుడు. ఆ అన్నదమ్ములకే అయిష్టుడాయెను. దీనిలో క్రీస్తును చూడండి. క్రీస్తు తన తండ్రికి మిక్కిలి ప్రియుడు. అయితే తన స్వకీయులకేమో అయిష్టుడాయెను. యోసేపు భాదింపబడెను సరే! క్రీస్తుకైతే నింకను దిగిపోయి శ్రమలలో అతిక్రమస్తులతో ఒకడుగా యెంచబడినదికాకుండ సిలువకు పోయి చంపబడెను. యోసేపు యెట్లు అన్యాయమైన చెరసాల భాదను తప్పించు కొనెను? దేవుడే కార్యస్థుడై తన కృపా మహదైశ్వర్యము వలన కలల వలననే తన మహిమ చూపి పైకి వచ్చి ఉద్యోగము మళ్ళీ పొందిన ఫరో పానదాయకుని ద్వారా గమనములోకి వచ్చి తుదకు ఫరో రాజు వలన బయటికి పిలువబడెను ఆది 41:14 చెప్పినట్లు రాజుగారి చేత పిలిపింపబడిన యోసేపు క్షౌరము చేయించుకొని మంచి బట్టలు కట్టుకొని ఫరో యెదుట సన్నద్ధుడాయెను. చెరసాలలో నుండి పిలువబడి రాజుగారు కనిన కలల భావమును విప్పి చెప్పగా ఆ గొప్ప రాజ్యములో రెండవ వాడుగా హెచ్చింపబడెను. ఆది 41:40 చూడండి.

1) మూడు అనే సంఖ్య క్రింద యోసేపు హెచ్చింపుపొంది. చెరసాలలో నుండి బయటకు వచ్చెను. ఆ పానదాయకుడు యోసేపును మరచిపోయి పూర్తిగా రెండేళ్లు గడిచిన తరువాత హెచ్చరింపబడి యోసేపు తనకు చేసిన సహాయము ఫరోతో చెప్పెను. అవును ఆది 41:1 ప్రకారము మూడవ సంవత్సరములోనే యోసేపు బడటికి వచ్చి చెరసాల విడిచి పెట్టెను. క్రీస్తు మనకొరకు సిలువకు వెళ్ళి మరణమనే గొప్ప చెరసాలలో వేయబడెనుగాని, మూడవ దినమున లేఖనముల ప్రకారము. సమాధి నుండి లేపబడెను. మూడు అంటె పునరుద్ధాన శక్తినింపబడిన సంఖ్య ఆది 41:4లో మూడవ సంవత్సరము అని చెప్పన వాక్కుతో 1 కొరింథి 15:4 మూడవ సంఖ్య అనే మాటతో సరిపోల్చుము.

2) కొత్తపేరు హెచ్చింపబడిన యోసేపు కివ్వబడెను. జప్నత్పనేహు. చనిపోయి లేచిన క్రీస్తుకు ప్రతి నామమునకు పైనామమివ్వబడెను. (ఫిలిప్పీ 2:11).

3) ఐగుప్తులో ఆనాడు ప్రతివాని మోకాలు యోసేపుకు

పూనండని వందనములు చేయండి అనేదానికి " వారు అతని యెదుటు మోకాల్లు పూనండని చాటించిరి".

4) హెచ్చింపబడిన యోసేపు కొరకు రాజైన ఫరో యొక్క భార్యను నియమించెను (ఆది 41:45). చనిపోయి లేచిన క్రీస్తు కొరకు సంఘమే భార్యగా నియమింపబడెను. (ఎఫెసీ 5:25-27).

5) చెరసాలలో నుండి ఫరో రాజుతో ఏలుటకు బయలుదేరి వచ్చిన యోసేపు భయంకరముగా తటస్థించిన ఆ క్షామము నుండి లోక ప్రజలందరిని రక్షించెను. సమస్త దేశం ఆహారము కొరకు యోసేపు వద్దకే రావలసి వచ్చెను (ఆది 41:57). అలాగేయిప్పుడు సమస్త పాపల రక్షణ కొరకు క్రీస్తు నొద్దకే రావలెను వేరొక దారిలేదు (అపో.కార్య 4:12) సర్వలోకానికి క్రీస్తు యొక్కడే రక్షకుడిగా నియమింపబడి యున్నాడు. ఆయన యొద్దకు వచ్చితిరా రాలేదా? క్రీస్తు యొక్కడే యిప్పుడు జీవాహారం అయి యున్నాడు.

## యరొబాము

ఈ యరోబాము చెరసాలలోనుండి బయటికి వచ్చి ఇరువది రెండు సంవత్సరములు పదిగోత్రములను ఏలెను అని యున్నది. (1 రాజులు 1:20). అతడు బీద వాడుగాయుండెను. అతని తల్లి విధవరాలు. అతని తండ్రి సొలోమోను సేవకులలో ఒకడు. అయితే ఇట్టివాడు పరము నందున్న తండ్రి వలన గొప్ప హెచ్చింపు పొంది దేవుని ప్రజలకు రాజాయెను. అవును పదిగోత్రముల వారు అతని చేతికివ్వబడిరి. అయితే నేమి? గొప్ప హెచ్చింపు పొంది, దైవజనుడైన అహీయా ద్వారా గొప్ప హెచ్చరికలను పొంది తాను పారిపోయిన ఐగుప్తు అను చెరసాలలో నుండి బయటికి వచ్చి రాజాయెను. లాభమేమి? త్వరలో తొలగిపోయి దానులోను బేతేలులోను రెండు బంగారపు దూడలను చేయించి పదిగోత్రముల వారిని విగ్రహారాధానలోకి దించి గొప్ప పాపములకు కారకుడాయెను. చెరసాలలో నుండి రాజ్యాము నేలుటకే బయటకు వచ్చెను. అయితే రాజ్యకార్యము భిన్నమాయెను. యరోబాము తన హృదయ మందు తలంచి ఇట్టి కార్యము చేసెనని 1 రాజులు 12:28 చెప్పుచున్నది హృదయము అనేది చాలా వ్యాధికలది అది ఘోర పాపసమేత మైనది యిర్మీయా 17:9 చూడండి. తన్ను హెచ్చించిన గొప్ప యెహోవాని ఆలోచించలేదు. ధర్మ శాస్త్రము చేతిలో నుండెను. దాని వారు వినలేదు. తన్ను అభిషేకించి పిలిచిన అహీయాతోనైనను చర్చించకుండా తన మోసకరమైన హృదయమును నమ్ముకొనియే యరోబాము దూడల వెంట పోయి త్వరలో చెడిపోయెను. గొప్ప పిలుపు చేతిలో నుండెను. గొప్ప భాగ్యము లభించెను. అయితే సాతాను వేసిన గొప్ప వలలో చిక్కుకుని మునిగిపోయెను.

పరిశుద్ధాత్మ దేవుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును గాక ఆమెన్!!!

---

**16వ పేజి తరువాయి....**

దేవుడు ప్రేమామయుడు. దేవుడు ప్రేమయైయున్నాడు అని కేవలం తెలియపరచుచున్నది (1 యోహాను 4:8) అంతకాదు ఆయన శాసనకర్త. ఆ శాసనకర్త విశ్వ వ్యవస్థను కోటాను కోట్ల యేండ్లకు పూర్వం ప్రప్రథమ సృష్టిని గుర్చి మాట్లాడుచున్నాడు ఈ ఘట్టం తరువాత ఎన్నో యుగాలు గడిచాయి. ఆదామును నిర్మించిన పూర్వం ఈ బ్రహ్మండంలో అసంఖ్యక గ్రహల మీద అనేక ప్రపంచాలలో జీవించిన ప్రాణులు వీరిని మనుష్యులు అనకూడదు వీరిని వ్యక్తులు అనాలి. అనగా వ్యక్తిత్వం కలిగినవారు. వీరికి సైన్సు "బుద్దిజీవులు" అని పేరు పెట్టింది. వీరిని పరిశుద్ధ గ్రంథం దేవదూతలు అని పేరు పెట్టినది దేవుడు ప్రతేకృమైన మర్మాన్ని బయలుపరచుచున్నాడు. పూర్వకాలమున నానా విధములుగా నానా సమయములలో తన ప్రవక్తల ద్వారా మాట్లాడిన దేవుడు ఇప్పుడు తన కూమారుని ద్వారా మాట్లాడెను. ఆయన ద్వారా ప్రపంచములు నిర్మించబడెను అని హెబ్రి 1:1 తెలియ పరచుచున్నది.


# నాయకత్వము



శ్రీమతి రిబ్కా విక్రాంత్

నాయకత్వము మంచిదే కాని నాయకుడు తానే తొలగిపోతే అతనితో కూడా నిలిచిన వారు తొలగిపోతారు. న్యాయధిపతుల గ్రంథములో కనబడుచున్న అబీమెలెకు, గిద్యోను ఉపపత్నికి పుట్టిన కుమారుడు. నాయకత్వము వహించి ఫలాని సందర్భము క్రింద న్యాయాధి 9:48 లో వ్రాసిన ప్రకారమ నేను దేనిచేయుట మీరు చూచితిరో మీరును నేను చేసినట్టుగా దానిని త్వరగా చేయుడని జనులతో చెప్పగా వారు చేసిరి. ఇది నాయకత్వమనునది. అయితే అబీమెలెకు నాయకత్వము మంచిది కాదు. అతడు నీతిమార్గము విడిచి ద్రోహిగాను తిరిగెను. గిద్యోనైతే దైవ భక్తి కలిగియుండి దేవుని చేతిలో సాధనముగా ఇశ్రాయేలీయుల విడుదలకై శత్రువులైన మిద్యానీయులతో మీదికి వెళ్ళుచు (న్యాయాధి 7:16 ప్రకారము) నన్ను చూచి నేన చేయునట్లు చేయుడనెను. నాయికత్వమిదే. ఇది మంచిది. మరియు అలనాడు దేవుని నడుపుదల క్రింద జరిగిన గిద్యోను నాయకత్వమును అనుసరించిన వారు కూడ జయము పొందిరి. పేతురు నాయకుడై యుండెను. ఇదొక వరము. అనేకులకది లేదుకాని పేతురుకుండెను. నేను చేపలు పట్టుబోదునని చెప్పగానే ఆరుగురు సమ్మతించి – మేమును నీతో కూడ వచ్చెదమనిరి – క్రీస్తు పొమ్మని చెప్పెనా? లేదు? చేపలు పట్టిడి విడిచి నావెంట రండి మిమ్మును మనుష్యులను పట్టు జాలరులనుగా చేస్తానని మూడు సంవత్సరములకు ముందు వారితో చెప్పి యుండెను గదా! పేతురైతె దుడుకుగల పేతురు. ఆయన పని పాటలు లేకుండా ఖాళీగా నుండలేనివాడు – క్రీస్తు చనిపోయి లేచియున్నాడు. ఇంతకు పూర్వము మార్కు 16:7 చెప్పుచున్నట్లు పేతురుకు కనబడియున్నాడు. ఆ శిష్యులతో కూడ కొందరాయనను చూచియుండిరి. అయితే తరుచుగా ఆయన కనబడుటలేదు. పనికూడ వారికింక పెట్టలేదు. ఆయన వారితో నలభై దినములుండబోతాడు. ఆ నలభై రోజులింకా అయిపోలేదు. సంగతి పండుకాక యున్నది. పిందేగానేయున్నది. పైనుండి మీరు శక్తి పొందువరకు పట్టణములో నిలిచియుండుడని ఆయన దీనికి పూర్వము వారితో చెప్పెను. ఆ పట్టణమనగా యెరూషలేము. వారిప్పుడుండెది గలిలయ దేశము. కాబట్టి సువార్త మీదికి వెళ్ళకూడదు. శక్తిలేనిదే ఎట్లు వెళతారు? స్వంత దేశములో వుండినను గలిలయలోనైనను, అప్పటికి సువార్త యాత్ర చేయుటకు ఉత్తరువు లేదు. క్రీస్తు వారికింకను ప్రత్యక్షము కావలెను. ఇంకను దేవుని రాజ్యములను వారికి బోధించ వలెను, అనేక సత్యములలో వారిని స్థిరపరచవలెను. నిలిచియుండటమే ఉత్తరువాయెను. అది పేతురుకు చాలా కష్టతరము కనుక ఆ ఫలాని రోజు ఇంకను ఖాళీగా నుండలేక పేతురు చేపలు పట్టబోదుననెను. అట్లు చెప్పగా ఆయనతో కూడా ఆరుగురు సమ్మతించిరి. మిగతావారేమి చెప్పెనో వ్రాయబడలేదు. పేతురు నాయకత్వము చెల్లిందిగాని క్రీస్తు యుత్తరువు క్రింద అది జరుగలేదు. పేతురు తనంతట తానే చేపలు పట్టబోవుటకు కోరుచున్నాడు. నాయకత్వముగలవాడా మీ వరము 'గొప్పదే కాని భయభక్తులతోనే దానిని వినియోగించండి లేదా మీరు కాలుజారి తప్పుడు త్రోవలో పడినందున మీతో కూడా పది మంది చెడిపోతారు.

దేవుడు మిమ్మును తన కృపలో కాపాడును గాక!



# విధేయత

రెవ. డా. జోసఫ్ కొడవటికంటి

మానవుడు దేవుని అనుగ్రహం పొందుటకు కావలసిన గుణములలో విధేయత ఒకటి. దీనిని గురించి అనేక సార్లు పరిశుద్ధత మాస పత్రికలో అనేక మంది విశ్వాసులు తమ శీర్షికలలో విపులంగ వ్రాసి వున్నారు.

ఈ విధేయత గురించి ఎంత వ్రాసిన తరగదు. ఇప్పుడు కూడ మనము కొన్ని సంగతులు తెలుసుకుందాం. విధేయత అనునది దేవునిని సంతోష పరిచే గుణము. ఇది బలులు అర్పించేటి కంటే అన్ని హోమములు కంటే ముఖ్యమైనది అని ఒకటో సమూయెలు 15:22,23 వచనలలో వ్రాయబడినది. అయితే మానవుడు మొదటి నుండి దేవునికి అవిధేయుడుగానే ఉండి ఆశీర్వాదములకు బదులు కీడును సంక్రమించు కుంటున్నాడు.

అత్యంత కృప కనికరములుగల దేవుడు మనము మట్టివార మని మట్టి గుణములుగల వార మని ఎరిగి మన పాపంములను బట్టి మనకు ప్రతికారము చేయుటలేదు మన దోషములను బట్టి మనకు ప్రతిఫలం ఇచ్చుటలేదు. అంత మాత్రమే కాక భ్రష్టులమైన మనలను తిరిగి రమ్మని తాను కృపగల వాడిని అని మన మీద తన కోపం పడనీయనని మన అవిశ్వాసమును బాగుచేసెదనని పాప భారంతో వున్న మనకు విశ్రాంతి కలుగజేసెదనని సెలవిచ్చుచున్నాడు. యిర్మీయా 3:12,22, మత్తయి 11:28.

అయితే దేవుడు ఇంతగా చెప్పినను మానవుడు తన అవిధేయుతను ఒప్పుకొని విడిచిపెట్టక సమర్ధించుకుంటు సాకులు చెప్పుతూ వున్నాడు. ఆదాముతో మొదలు పెడితే "ఆ పండు తిను దినమున నీవు నిశ్చయముగా చచ్చెదవు". అని ఖచ్చితముగా ఆజ్ఞాపించిన ఆజ్ఞకు లోబడక మరణమును లోకములోనికి ప్రవేశింప చేశాడు.

ఎందుకు చేశావు అని దేవుడు ప్రశ్నించినప్పుడు పాపమును ఒప్పుకొనక కుంటి సాకులతో కప్పిపుచ్చ ప్రయత్నించాడు.

" ఆదాము చేసినట్లు నా దోషములను దాచి పెట్టుకొని....... రోమ్ములో నా పాపమును కప్పుకొనిన యెడల" యోబు 31:33,34.

ఆదాము దేవునికి చెప్పిన జవాబు ఏ విధంగా వుందో చూడండి.

"నాతో ఉండుటకు నీవు నా కిచ్చిన ఈ స్త్రీయే ఆ వృక్ష ఫలములు కొన్ని నాకు ఇయ్యగ నేను తింటిని" అంటే ఆదాము తన తప్పును ఒప్పుకొనక కప్పుకుంటున్నాడు. సమర్ధించుకుంటున్నాడు. తను అలా చేయుటకు కారణం "నీవు నాకు ఇచ్చిన స్త్రీయే అంటే దేవునిది దేవునిచే ఇవ్వబడిన స్త్రీదే తప్పని తప్పించుకో చూచాడు."

"అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును." సామె 28:13

ఆ విధంగా ఆదాము పాపమును ఒప్పుకొనక కుంటిసాకులు చెప్పి సమర్ధించుకొనే ప్రయత్నంలో శపించబడ్డాడు. అలాగే సౌలు విషయంలో కూడ జరిగినది ఇశ్రాయేలీయులలో ఆఖరి గోత్రపువాడు అల్పుడు అయి దాగియున్న సౌలును (1 సమూయేలు 10:22) ఇశ్రాయేలీయులకు మొట్టమొదట రాజుగా హెచ్చించి దేవుని బిడ్డలకు విరోధులును అక్రమస్తులను అయిన అమాలేకీయులను సమూలముగ నాశనము చేయమని సెలవిచ్చిన దేవుని ఆజ్ఞను మీరినపుడు ప్రవక్తయైన సమూయేలుకు తాను దేవుని ఆజ్ఞను పూర్తిగా నెరవేర్చనని

అబద్ధమాడాడు. సమూయేలు ద్వారా దేవుడిచ్చిన ఆజ్ఞ ఏమనగా "నీవు పోయి కనికరింపక అమాలేకీయులను హతము చేయుచు పురుషులనేమి, స్త్రీలనేమి, బాలురనేమి, పసిపిల్లలనేమి, ఎద్దులనేమి, గొర్రెలనేమి, ఒంటెలనేమి, గార్ధభములనేమి అన్నిటిని హతముచేసి వారికి కలిగిన దంతయు బొత్తిగా పాడుచేసి అమాలేకియులను నిర్మూలము చేయుమని చెప్పెను. 1సమూయేలు 15:3.

అయితే సౌలు క్రొవ్విన ఎడ్లను, గొర్రెలను, కొన్నిటిని తీసుకొని వచ్చి దాచి ఉంచాడు. అప్పుడు సమూయేలు మరి నాకు వినబడుచున్న ఎడ్ల రంకెలు, గొర్రెలు అరుపులు ఎక్కడవి అని ప్రశ్నించాడు. (జంతువులు అబద్ధమాడవు కదా!). సౌలు పాపములు ఒప్పుకొనక సమర్ధించుకృంటు తప్పును ఆదాము వలె ఇతరుల మీదికి నెట్ట ప్రయత్నించాడు. తనదేమి తప్పులేదని జనులు శపితమైన వాటిలో నుండి క్రొవ్విన వాటిని దేవుని కొరకే నాశనము చేయకుండ ఉంచారు. అంటే దేవునికి బలి ఇచ్చుట కొరకే ఉంచారు అని సమర్ధించుకొన్నాడు.

కాని తప్పును పశ్చాతాపముతో ఒప్పుకొనలేదు. సౌలు ఇచ్చిన జవాబు ఎంత బుద్ధిహీనమైనదో అతడు గ్రహించలేదు. దేవునికిచ్చే అర్పణలు పరిశుద్ధము పవిత్రములు అయి ఉండవలెను, శపితమైన వాటిని పరిశుద్ధుడైన దేవుడు స్వీకరించునా! విశ్వాసులలో అనేకమంది అక్రమునగా సంపాదించిన ధనములో దేవునికి పెద్ద మొత్తంలో కానుకలు ఇస్తూ తాము చాలా గొప్ప పని చేసామని గొప్పలు చెప్పకుంటు ఉంటారు. శపితమైనది దేవుడు స్వీకరించడని వారికి తెలియదు అవిధేయుడవై ఉండి దేవుని ఆజ్ఞాను మీరి అక్రమముగా ధనము సంపాదించు వారు దానిలో కొద్దిగ దేవునికిచ్చి ఈ సంపాదన అంత నీ కొరకే అయ్యా! అని చెపితే దేవుడు సంతోషిస్తాడా! అందువలననే సౌలు రాజుగా విసర్జించ బడ్డాడు చేసిన తప్పును ఒప్పుకొని విడిచిపెడితే దేవుడు కనికరిస్తాడు. లేకపోతే విసర్జించబడెదెరు. (ఇంకా ఉంది)

## గమనిక

అక్షరయజ్ఞం పోటీలో పాల్గొనుచున్న ప్రియులకు మనవి. ఫోన్‌లో జవాబులు చెప్పేవారు ఖచ్చితంగా జాబు కూడా వ్రాయలని పోయినసారి పత్రికలో ప్రకటించాము. ఫోన్‌లో కూడా చెప్పాము. ఫోన్‌లో చెప్తే మీ పేరు ముందుగా నమోదు చేసుకుంటాము కాని, అక్షరయజ్ఞంలో ఉన్న పజిల్స్ అన్నీ కరెక్ట్‌గా వ్రాసి పంపాలి. అప్పుడ ప్రైజ్ ఇవ్వబడుతుంది. ఈ నెలలో ఇద్దరు ఫోన్‌లో చెప్పారు కానీ లెటర్‌లో జవాబులు వ్రాయలేదు. ఒక్క అక్షరయజ్ఞం ఫోన్‌లో చెప్తే సరిపోదు. మిగతా పజిల్స్ కూడా కరెక్టుగా వ్రాయాలి.

### ఈ నెల విజేతలు

**కసుకుర్తి సాయిలత,** 10వ తరగతి, పైడిపాడు, ప్రకాశం జిల్లా
**సుష్మారాధిక,** బి.కాం. సెకండ్ ఇయర్, గంగవరం, ప్రకాశం జిల్లా
వీరిద్దరికీ ప్రైజ్ సమానంగా పంచబడుతుంది.
ఫోన్‌లో చెప్పిన వారు ఫోన్ చేసి అడ్రస్ పంపితే స్పెషల్ ప్రైజ్ ఇవ్వబడతుంది.



# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1) జ్యేష్ఠులను వదలి చిన్నవారిని దేవుడు ఏర్పరచుకొనిన వారెవరు? మీకు తెలిసినన్ని పేర్లు వ్రాయండి. ఎక్కువ వ్రాసిన వారికి బహుమతి.

2) అపొస్తలుల కార్యములు 1 నుండి 3 అధ్యాయములు చదివి క్రింద గళ్ళలో దాగివున్న వాక్యమును కనుగొనండి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రు | న | కి | తి | వా | శు | తై |
| ద్దా | రి | నిం | అ | ఖా | త్మ | చి |
| డి | క్తి | రి | అం | తి | వా | ష |
| ప్ల | న్య | కో | మ | తో | లా | న |
| ఆ | ట | లి | తో | H | పా | త్మ |
| శ | గ్ర | ల | H | గి | ది | హి |
| డ | H | క్ | ల | మా | రి | ద |

3)

1. బైబుల్లో హిజ్కియా సేవకులు రచించినవి ఏవి?
2. మా ఆయుష్కాలము 70 సం॥లు, అధిక బలమున్న యెడల 80 సం॥లు అని ఎవరు వ్రాశారు?
3. నేడు అనబడు సమయముండగానే ప్రతిదినము ఒకనికొకడు బుద్ధి చెప్పుకొనుడి
4. శోధింపబడి, శ్రమపడెను గనుక శోధింపబడు వారికి సహాయము చేయగలవాడైయున్నాడు.
5. ఇంత గొప్ప రక్షణ మనము నిర్లక్ష్యము చేసిన యెడల ఎలాగు తప్పించుకొందుము?
6. సహాయము కొరకు ధైర్యముతో కృపాసనము యొద్దకు చేరుదము.
7. నిశ్చయముగా నేను నిన్ను ఆశీర్వదింతును, నిశ్చయ ముగా నిన్ను విస్తరింపజేయుదును.

**గమనిక :**

మీ సమాధానాలు లెటర్ ద్వారా కాని, ఫోన్ ద్వారా కాని మాకు తెలియజేయండి.
ఫోను ద్వారా సమాధానాలు తెలియజేసిన వారు ఖచ్చితంగా లెటర్ ద్వారా సమాధానాలు పంపాలి.

మా సెల్ నెం. - 9704255416, 8297715298.

మీ సమాధానాలు పంపడానికి చివరి తేది - 25-5-2014

**(ఈ పోటీలో గెలుపొందినవారికి రూ. 25/- నగదు బహుమతి, ఎక్కువమంది విజేతలయితే లక్కీ డిప్ ద్వారా నిర్ణయించబడును.)**

**మా చిరునామా :**

**బైబిల్ క్విజ్, ఎడిటర్, పరిశుద్ధత, పోస్ట్‌బాక్స్ నెం. 28, ఒంగోలు - 523 001**

ఉచితం! ఉచితం!! ఉచితం!!!

విద్యను అమ్ముతున్న కాలంలో విద్యాదానం చేస్తున్న

# I.E.R.F. మిషన్ విద్యా సంస్థలు

(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపబడిన సంస్థ)

## కృపాదానంగారి వీధి, క్లౌపేట, 6వ లైను, ఒంగోలు

పేద బడుగు వర్గాల విద్యార్థినీ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు గొప్ప సదవకాశం. త్వరపడండి. I.E.R.F. సంస్థ గత 40 సంవత్సరాలుగా పేద బడుగువర్గాల అభ్యున్నతి కొరకు విద్యారంగంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను చేపట్టి రెసిడెన్షియల్ స్కూల్‌తో సమానంగా విద్యను అందిస్తుంది. గత ఏడాది మా U.C.L.I. స్కూల్‌నందు 10వ తరగతిలో 90% ఉత్తీర్ణత. అంతమాత్రమే కాక ఈ సంస్థలో చదివిన వారికి దైవానుగ్రహం కూడా మెండుగా లభిస్తుందని చెప్పటానికి ఋజువు ఈ సంస్థలో చదివిన వారు అనేకులు విదేశాలలో (అమెరికాలో) ఉద్యోగం చేస్తూ ఉండటం గమనార్హం. ఈ విధంగా పేద బడుగు వర్గాల అభ్యున్నతిని సాధిస్తున్న I.E.R.F. సంస్థ గత 2 సంవత్సరాలుగా 1,2,3 తరగతులకు ఉచితముగా కాన్వెంట్ స్థాయిలో ఇంగ్లీషు బోధన మొదలుపెట్టింది. టీచర్స్ ఇంగ్లీషు మాతృభాష అయిన ఇంగ్లండు దేశపు వారు కావటం ఇంకొక ప్రత్యేకత. మా స్కూలునందు ఎలిమెంటరీ పిల్లలు సైతం ఇంగ్లీషు మాట్లాడటము గమనార్హం.

### మా స్కూలు ప్రత్యేకతలు

★ అన్ని తరగతుల విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కలదు.

★ 1,2,3 తరగతులకు ఇంగ్లండ్ దేశపు యువతులచే ఉచిత ఇంగ్లీషు బోధన.

★ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం మరియు ఒక జత యూనిఫాం ఉచితంగా ఇవ్వబడును.

★ విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా ఉచిత హాస్టల్ సౌకర్యం కలదు.

★ కులమత సంబంధం లేదు ఎవరైనా మా హాస్టల్‌లో చేరవచ్చును.

★ 1,2,3 తరగతులకు A/c Class Room సౌకర్యం కలదు.

★ ఎలిమెంటరీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సదుపాయం మరియు ఫ్యామిలీ సపోర్టు కలదు.

★ స్కూల్లో చదువుతున్న పిల్లల తలిదండ్రులకు కష్టకాలంలో వైద్య, ఆర్థిక సహాయము కొరకు కృషి చేయబడును.

★ బాలికలకు ఉచితంగా A.N.M., G.N.M. నర్సింగ్, INTER శిక్షణ ఇప్పించబడును.

★ B.Sc. నర్సింగ్ వారికి స్వల్ప ఫీజులతో శిక్షణ.

★ 1 నుండి 10 వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. సీట్లు పరిమితం విచ్చేయండి.

సీట్లు పరిమితం కనుక ముందుగా సీటు రిజర్వ్ చేసుకొనవలెను.

మీ పిల్లల చక్కని భవిష్యత్ కొరకు ఉన్నత విద్యాబుద్ధుల కొరకు
ఐ.ఈ.ఆర్.ఎఫ్. సంస్థలో చేర్పించండి.

ఇట్లు
రెవ.డా॥ జోసఫ్ కొడవటికంటి, కరస్పాండెంట్
సెల్ : 9676340371, 9704255416